honeybee.org
Vol-13 Issue-5
వెల : రూ. 20/-

సంపుటి 13 సంచిక 5 సెప్టెంబర్ - అక్టోబర్ 2025

# పల్లెసృజన

www.pallesrujana.org

## గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక





ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళం జిల్లాలో 'పెద్ద తరమపల్లి' నుండి 'తురకల కోట' వరకు జరిగిన

# 54వ చిన్న శోధయాత్ర లోని కొన్ని చిత్రాలు











సంపుటి-13 సంచిక - 5 సెప్టెంబర్ - అక్టోబర్ 2025

# పల్లెసృజన

పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్– 500 094.
ఫోన్ : 040–49253096, 98660 01678
E-mail : president@pallesrujana.org,
Visit :www.pallesrujana.org

**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**

సంపాదకులు :
**జమ్ములమడక శశిమోహన్**

ఉప సంపాదకులు :
**పల్లె వీర రాఘవ రెడ్డి**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త**
**జాగర్లమూడి దుర్గాప్రసాద్**
**జమ్ములమడక శ్రీకర్**
**డా. కల్పనా శాస్త్రి**

డిజైనింగ్ & ప్రింటింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్**, హైదరాబాద్.
ఫోన్ : 81257 99904,
E-mail : narendragrafixhyd@gmail.com

## ఈ సంచికలో.....

* సృజనాత్మకతతో రైతుల అలసట తీర్చి, ఖర్చు తగ్గించే మహిపాల్ చారి ఆలోచన ..... - 4
* 'సేంద్రియ వ్యవసాయం"-"ప్రకృతి వ్యవసాయం' రెండింటి మధ్య వ్యత్యాసం : కేంద్ర ప్రభుత్వ వివరణ - 6
* 'పునాది స్థాయి ఇన్నోవేషన్ల'తో గ్రామీణ యువతకు స్వయం ఉపాధి - 9
* చిరు ధాన్యాల పంటల అభివృద్ధిలో విజయకుమార్ విజయ పరంపర - 12
* జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు - 14
* యువత అవగాహనకై పకృతిలో లభించే చెట్ల పేర్లు సంస్కృతం మరియు తెలుగు భాషల్లో - 18
* డా. ఎపిజె అబ్దుల్ కలామ్ చిన్నపిల్లల సృజనాత్మక మరియు ఇన్నోవేషన్ పురస్కారాలు - 20
* నీతి ఆయోగ్ చే గుర్తింపు పొందిన 'పల్లెసృజన ఇన్నోవేటర్లు' - 23
* పల్లె జ్ఞానం - 25
* ఎన్ఐఎఫ్ వారి 'పీపుల్స్ ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ 2వ ఉత్సవాలు - కొత్త ఢిల్లీ లో వెలుగులోకి వచ్చిన నూతన ఇన్నోవేషన్‌లు - 27
* ఆయుర్వేద జ్ఞాన మథనం - 30
* స్పందన - 32

**కవర్ లోపలి పేజీల్లో ...**

54వ చిన్నశోధయాత్ర చిత్రాలు,
ఇన్నోవేటర్ 'కొడిముంజ ప్రవీణ్' కు "రైతునేస్తం అవార్డు"

**మధ్య పేజీలో :**

సెప్టెంబర్ – అక్టోబర్ 2025 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాలు

Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix,** 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. –500094. Telangana State, Editor : **J. Sesimohan.**

**HoneyBee Regional Collaborators & Publications**

**Honey Bee (English)**
AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank, Navrangapura, Ahmedabad - 380 009 Gujarat, India.
Phone: 91-79-27912792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org

**Karshakan Samsarikkatte (Malayalam)**
Fr Hubby Mathew
Peermade Development Society,
Peermade, Idukki - 685531,
Kerala hmathew@gmail.com

**Nam Vali Velanmai (Tamil)**
Mr P Vivekanandan
45, T P M Nagar,Virattipathu,
Madurai - 625010 Tamil Nadu
vivekseva@gmail.com

**Palle Srujana (Telugu)**
Brig Pogula Ganesham VSM (Retd)
102, Vayupuri, Sainikpuri Post
Secunderabad-500 094 Telangana.
president@pallesrujana.org, www.pallesrujana.org

**Loksarvani (Gujarati)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

# దేశానికి "గ్రామాలే పట్టుకొమ్మలు"

గ్రామం అంటే ప్రకృతి - ప్రజలు. గ్రామాభివృద్ధి అంటే ప్రజలు ప్రకృతితో మమేకం కావడం - అందరికీ ఆహారాన్ని ఇవ్వడం, తమ ఆశలు, ఆశయాలను నిజం చేసుకోవడానికి శాంతియుత, ఆరోగ్యకరమైన జీవనాన్ని సాగించడం.

గ్రామ అభివృద్ధి ప్రణాళికలు పైవాటికి ప్రాధాన్యత ఇవ్వడం లేదు. తమకు తోచింది, ప్రపంచంలోని కొన్ని పద్ధతులను, టెక్నాలజీలను గ్రామాలకు అందించడం గ్రామాభివృద్ధిగా పరిగణిస్తున్నారు. ఈ పద్ధతిలో గ్రామీణులకు శక్తులు, వారి ప్రకృతి వనరులు, వారి ఆశయాలు కనిపించవు. అందుకే "గ్రామ అభివృద్ధి పథం" అంటే ప్రభుత్వాలకు తోచింది ఇవ్వడం - కాని గ్రామాలకు కావాల్సింది, ఆశించింది మాత్రం కాదు అన్నది ముమ్మాటికీ సత్యం. దీనికి ముఖ్యమైన మూడు కారణాలు చర్చిద్దాం.

గ్రామ ప్రజలతో చర్చలు, వ్యక్తిగత సంభాషణలు, పెద్దల ఆలోచనలు, ఊరి శక్తులు, వాడని వనరులు, వలసకు కారణాలు, ఉపాధ్యాయుల నైపుణ్యాలు, మూఢ నమ్మకాలు.... ఇవన్నీ పరిగణలోకి తీసుకుంటే తప్ప గ్రామానికి - ప్రజలకు ఏం కావాలో పూర్తిగా తెలుసుకోవడం అసాధ్యం. ఊరిని ఒక సమూహంగా గుర్తించి, అందులో ప్రాధాన్యులు ప్రజలు - ప్రకృతే అన్న అవగాహనతో గ్రామాభివృద్ధి ప్రణాళిక తయారు చేయాలి. గ్రామంలోని ఎగుమతి - దిగుమతులపై పూర్తి అవగాహన ఉండాలి. దిగుమతులను తగ్గించడంపై గ్రామ ప్రజల వనరులు, వారి నైపుణ్యం ఎలా ఉపయోగపడుతుందో బేరీజు వెయ్యాలి.



రెండవ ప్రధాన అంశం - ప్రకృతి, వనరులు. పల్లెలు సమృద్ధిగా జీవించడానికి కావలసినవన్నీ ప్రకృతిలో ఉన్నాయి. ఆహార గొలుసు (ఫుడ్ చైన్) అవగాహనతో మనం గ్రామాల్లోని వనరులను పరిశీలిస్తే - స్వయం సమృద్ధి గ్రామాల్లో ఎలా సాధ్యమో అర్థం అవుతుంది. పునరుత్పత్తి - పండించకుండానే ఆహారం - మనుష్యులకు మరియు పశువులకు లభ్యం కావడానికి మూల ఆధారాలు. వీటి ఆధారంగా గ్రామ స్వయం సమృద్ధి దిశగా ప్రణాళికలు వేయాలి. ఇవే పల్లెల అంతర్లీన శక్తులు. వీటి గురించి తెలుసుకోవడం గ్రామ పెద్దలను సంప్రదించడం వల్లే అవుతుంది. పెంపుడు జంతువులు, ఆవులు, బర్రెలు, గాడిదలు, గొర్రెలు, మేకలు, పందులు వగైరా.... పక్షులు, కోళ్ళు, బాతులు, సీమ కోళ్ళు వగైరా.... వీటన్నిటిని గ్రామ ప్రజలు వికేంద్రీకరణ పద్ధతిలో పెంచడం తరతరాలుగా ఆ జ్ఞానాన్ని పంచడం ఈ వనరులను ఆహారంగా, వ్యాపారంగా వాడుకోవడం జరిగింది. అప్పుడు వ్యవసాయం అంటే 'గ్రామ మనుగడ'గా చూసేవారు. అన్ని రకాల ఆహారాలను ఉత్పత్తి చేసేవారు. ధాన్యం పండిస్తే పశువులకు గడ్డి, మనష్యులకు ధాన్యం - అలాగే ఇతర పప్పులు, పండ్లు - అందరికీ, అన్నిటికీ ఆహారంగా పెంచేవారు. వీటన్నిటిని గ్రామాభివృద్ధి ప్రణాళికలో భాగంగా జోడిస్తే బాగుంటుంది కదా!

ఈ వరుసలో మూడవ అంశం - రైతులు. గ్రామ ప్రజలకు ప్రధానంగా వ్యవసాయం జీవనాధారం. రైతు కుటుంబంలో పుట్టిన బిడ్డలు రైతులం అనేవారు. దానివల్ల రైతులకు

గ్రామాల్లో కొదవ ఉండేది కాదు. భూమిలేని కుటుంబాలు వ్యవసాయకూలీలుగా పనిచేసేవారు. ఈ విధంగా ప్రధాన గ్రామ జీవన వృత్తి - వ్యవసాయం తరతరాలుగా నిర్విరామంగా చేయడం సాధ్యమైంది. దేశ ప్రజలకు ఆహారం ఇలాంటి వ్యవస్థలో ఎల్లప్పుడు లభించేది. వలసలు తక్కువగా ఉండేవి కాబట్టి వ్యవసాయం నిర్విరామంగా సాగింది. కానీ ప్రస్తుత ఆధునిక వ్యవసాయం గ్రామీణ ప్రాచీన సహజ వ్యవస్థను అతలాకుతలం చేసింది. త్రిశంకులా పాతవి మరిచి, కొత్తవి అవలంభించలేక రైతులు సతమతమవుతున్నారు. ప్రస్తుత గ్రామ రైతుల పరిస్థితి ఏవిధంగానూ ఆనందకరంగా లేదు. వారికి జీతాలు లేవు. ప్రమోషన్లు లేవు. రిటైర్మెంట్లు లేవు. ఫించను లేవు. పెద్దవాళ్ళు వయసుతో వ్యవసాయం విరమించుకుంటే, వాళ్ళ స్థానాల్లో భర్తీ చేయడానికి శిక్షితులైన యువ రైతులు లేరు. ఈ అంశంపై గ్రామాల్లో నిర్విరామంగా వ్యవసాయం కొనసాగింపుకై ఏ ప్రణాళికలు, వ్యవస్థలో ఏ దిశా నిర్దేశాలు ఇంతవరకు లేవు. దాంతో రైతుల సంఖ్యను భర్తీ చేయడం అన్న చర్చే లేదు. యువత విద్యాసంస్థల నుండి శిక్షణ పొంది రైతు సమాజంలో చేరాలన్న ఆలోచనే లేదు. యువకులు కూడా ప్రభుత్వ పాలసీకి అనుగుణంగా గ్రామాలు వదలి వలస పోతున్నారు. రైతుకు, రైతు వృత్తికి ఆదరణ, గౌరవం, వారి అత్యవసర శ్రమ ఎవ్వరూ చర్చించటం లేదు, ప్రాధాన్యత ఇవ్వటం లేదు.

పై పరిస్థితుల్లో గ్రామ ప్రజల అభివృద్ధి జరుగుతోంది అంటే అది నామమాత్రమే. ప్రభుత్వాలు ధనం ఖర్చు పెట్టాలి కాబట్టి స్కీములు పెడుతున్నారు కాని ఫలితాలకై, ప్రజల జీవితాలను ప్రభావితం చేయాలన్న ప్రయత్నం లేదు. ముఖ్యంగా ఇంటర్ పాసయిన యువత కనీసం తెలుగు రాష్ట్రాల్లో గ్రామానికి నలుగురు చొప్పున 24,000 గ్రామాల నుండి సంవత్సరానికి దాదాపు లక్ష మందికి పైగా యువత డిగ్రీ చదవలేక (ఎన్నో కారణాల వల్ల), ఊళ్లో వ్యవసాయ పని చేయలేక, త్రిశంకు స్వర్గంలో ఉన్నారు. అది నిజంగా త్రిశంకు నరకమేమో!

రైతు వృత్తిని, వారి సంఖ్యను ప్రతి గ్రామానికి సరిపడేలా చూడాలి. ప్రోత్సాహకాలు, వ్యవసాయ భూమి, ఉచిత శిక్షణ, తక్కువ ధరలో పంటలకు కావలసిన వస్తువులు..... తప్పనిసరి ధాన్యం కొనుగోలు.... వగైరాలు గ్రామ యువతకు శిక్షణ తర్వాత ప్రోత్సాహకాలుగా ఇస్తే రైతుగా జీవనోపాధిని ఎన్నుకోవడానికి అపార అవకాశాలిస్తాయి.

'పల్లెసృజన' అనుభవంతో మన గ్రామాలను స్వయం సమృద్ధి చేయవచ్చు, దానికి అభివృద్ధి దృక్పథం మారాలి. పాశ్చాత్య పోకడలు, సాంకేతిక ఆధారిత వ్యవసాయాలు తగ్గించాలి. గ్రామ యువతకు రైతుగా జీవించడానికి ప్రోత్సాహమివ్వాలి. సమూహాలను తిరిగి ఉద్ధరించి, వారి పూర్తి ప్రమేయంతో, యువ శక్తితో, ప్రకృతిపై గౌరవంతో ప్రకృతి - ప్రజల మమేకాన్ని గౌరవిస్తూ ముందుకు సాగితే "గ్రామాలు పట్టుగొమ్మలు" అన్న గాంధీగారి కల నిజం చేయవచ్చు అన్నది మా విశ్వాసం.

వరుణదేవుడి కరుణతో వర్షాలు పుష్కలంగా పడినా, అకాల వర్షాలతో పంటలు జరిగిన రైతులకు సానుభూతితో మీ సుఖ శాంతులను సదా ఆశించే....

భవదీయ
బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్)

**"పల్లెసృజన విశ్వాసం"**

❖ రైతులు గ్రాహకులు కాదు సమకూర్చేవారు (ప్రొవైడర్స్) ❖ ఊళ్ళు అంతులేని బావులు కాదు - అవి ఆధారాలు (సోర్స్)




'పల్లెసృజన' ద్వారా వెలుగులోకి వచ్చిన తెలంగాణ లోని హనమకొండ జిల్లా, పర్కాలకు చెందిన ఇన్నోవేటర్ 'కడివెండి మహిపాల్ చారి' గురించి పాఠకులకు పరిచయమే. వ్యవసాయం చేయటానికి ఎద్దులు లేక, ట్రాక్టర్లు కిరాయికి లభించక బాధ పడుతున్న సన్న, చిన్నకారు రైతుల కొరకు చేతితో నడిపే వీడర్‌ను తయారు చేసి ఇప్పటికే కొన్ని వేల వీడర్లను రైతు లోకానికి అందించాడు (జనవరి–ఫిబ్రవరి 2013 సంచిక చూడండి). నాటి నుండి తన సృజనాత్మక ఆలోచనలను ఆపకుండా, గ్రామీణులకు, రైతులకు ఎన్నో ఇన్నోవేషన్లను అందించాడు. అందులో చేతితో నడిపే వీడర్, శ్రీవరిలో కలుపు తీసే వీడర్, గ్రామాల్లో ట్రాక్టర్లు, లారీలకు సరుకులు ఎత్తేందుకు తక్కువ ఖరీదులో క్రేన్, గ్రామీణ మరియు పట్టణాల్లో సరుకుల రవాణా కొరకు ఎలక్ట్రిక్ ట్రాలీ లాంటివి ఎన్నో ఉన్నాయి. ఇలా మహిపాల్ చారి ఎప్పటికప్పుడు తన ఆలోచనలకు పదును పెడుతూ గ్రామీణులకు రైతులకు శ్రమ, ఖర్చు తగ్గించేందుకు నిరంతరం స్వచ్ఛందంగా కృషి చేస్తూ ఉంటాడు.

ఇలా గడుస్తున్న కాలంలో ప్రస్తుతం రైతులు ఎక్కువగా చైనా వీడర్ల పైన దృష్టి మరల్చి చిన్న, సన్నకారు రైతులు వాటిని కొనుగోలు చేసి తమ సేద్యపు పనులు చేసుకుంటున్నారే కానీ, దాన్ని నడపాలంటే చాలా ఇబ్బందికి, శ్రమకు గురవుతున్నారు. అందుకు కారణం ఆ వీడర్లు ఎక్కువగా కుదుపులు ఉండటంతో దాన్ని నడిపే వ్యక్తి చాలా త్వరగా అలసిపోవటం వల్ల ఎక్కువ పొలంలో సేద్యం చెయ్యలేక పోతున్నాడు అన్న విషయం గమనించాడు.

ఈ వీడర్లు కుదుపు (వైబ్రేషన్) లేకుండా చెస్తే, దాన్ని నడిపే వ్యక్తి ఇంకా ఉత్సాహంగా, ఎలాంటి అలుపు లేకుండా ఎక్కువ పొలం దున్న గలుగుతాడు అని ఆలోచించాడు. ప్రస్తుతం తన షాపులో తాను తయారు చేసిన వీడర్లతో పాటు, చైనా వీడర్లను కూడా అమ్మకాలు చేపట్టాడు. ఇటీవల వాటికి కొద్దిగా గిరాకీ తగ్గింది. అందుకు కారణం ఈ కుదుపుల వల్ల వాటిని కొనుగోలు చేయటానికి రైతులు ఎక్కువగా ఉత్సాహం చూపటం లేదు అని తెలుసుకుని, అప్పుడు ఆలోచించాడు ఈ సమస్యకు ఎలాగైనా పరిష్కారం కనుగొనాలి అని.

సాధారణంగా మోటార్ సైకిళ్ళకు, ఇతర వాహనాలకు తప్పక 'షాక్ అబ్జార్బర్స్' ఉండటం వల్ల అవి కుదుపులు లేకుండా వాటిపైన ప్రయాణించ గలుగుతున్నాము కదా అని ఆలోచించి, తనవద్ద వున్న ఒక చైనా వీడర్‌కు ఒక షాక్ అబ్జార్బర్ ను అమర్చి పొలంలో పరీక్షించాడు. తాను ఊహించిన విధంగానే ఎలాంటి కుదుపులు, వైబ్రేషన్స్ లేకుండా చాలా సున్నితంగా యంత్రం నడవటం గమనించాడు. ఇప్పుడు ఈ యంత్రాన్ని నడపటానికి ఎక్కువ శ్రమ పడాల్సిన పనిలేదు అనుకున్నాడు. గతంలో ఈ వీడర్లపైన పని చేసిన వ్యక్తి సాయంత్రానికి ఎంతో





అలసిపోయి, ఆ నొప్పులు భరించలేక కొందరు సాయంత్రం మద్యపానానికి అలవాటు పడటం వల్ల వారి ఆరోగ్యాలు కూడా క్షీణించేవి. ఈ షాక్ అబ్జార్బర్ ఏర్పాటు చేసిన తర్వాత దాన్ని చూసిన రైతులు ఇప్పుడు ఈ వీడర్లను కొనటానికి ఉత్సాహం చూపుతున్నారు.

తాను అమ్మే కొత్త వీడర్లకు మాత్రమే షాక్ అబ్జార్బర్ ను అమర్చటమే కాదు. రైతులు తమవద్ద వున్న వీడర్‌కు కూడా దీన్ని అమర్చుకునేందుకు షాక్ అబ్జార్బర్ ను తయారు చేసి కేవలం రూ.



2,500లకే ఇవ్వటంతో ఎంతోమంది రైతులు తమ పాత యంత్రాలకు దీన్ని అమర్చుకుని ఎంతో ఆనందంగా తమ వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. తను నివాసం ఉంటున్న 'పరకాల' సమీప ప్రాంత రైతులు తమ వీడర్‌ను అతని వద్దకు తెచ్చి షాక్ అబ్జార్బర్ ను ఏర్పాటు చేయించుకుని వెళుతున్నారు. అలాగని దూరం వున్న రైతులు దిగులు పడాల్సిన అవసరంలేదు. వారి వీడర్‌ను ఫొటో, ఒక వీడియో తీసి పంపినట్లయితే దానికి అనుగుణంగా ఎక్కడ, ఎలా షాక్ అబ్జార్బర్ బిగించాలో తానే చెప్తూ కేవలం ఆ పరికరాన్ని తయారు చేసి పంపుతాడు. కాబట్టి పాత వీడర్లు వున్న రైతులు ఇకపై ఎక్కువ శ్రమ, అలసట లేకుండా తమ వీడర్‌కు షాక్ అబ్జార్బర్ బిగించుకుని, ఇంకా ఎక్కువ ఉత్సాహంగా, ఎక్కువ సమయం పొలం పనులు చేసుకోవచ్చు. వీడర్లు లేని రైతులు తాము కొనుగోలు చేయాలి అనుకుని మహిపాల్ చారిని సంప్రదిస్తే కొత్త వీడర్‌కే షాక్ అబ్జార్బర్ అమర్చి పంపిస్తాడు. ●

**ఇన్నోవేటర్ మహిపాల్ చారి, ఫోన్ నెంబర్ : 98669 22168**

గ్రామీణులకు బైకు పెట్రోల్ ఖర్చు లేకుండా మహిపాల్ చారి మరో ఆలోచన...

## పెట్రోలు ఖర్చు లేకుండా ఎలక్ట్రిక్ బైకుగా పాత మోటార్ సైకిల్

ప్రస్తుతం గ్రామాల్లో దాదాపు ప్రతి రైతుకు ఒక మోటార్ సైకిల్ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకుంటున్నారు. తాము ఉంటున్నది గ్రామాల్లోనే కాబట్టి తాహతు లేని వారు కొత్త మోటార్ సైకిల్ కాకుండా, తమ శక్తి కొద్దీ పాత మోటార్ సైకిల్‌ను కొనుగోలు చేసుకుని తమ పొలాలకు, సమీప పట్టణాలకు వెళ్ళి వచ్చేందుకు స్వంత రవాణా సౌకర్యాన్ని పొందుతున్నారు. కానీ, వీటికి పెట్రోలు ఖర్చు రైతుకు పెద్ద గుదిబండలా తయారైన పరిస్థితి అందరికీ తెలిసిందే.



ఈ సమస్యకు కూడా మహిపాల్ చారి పరిష్కారం చేశాడు. తనవద్ద వున్న పాత మోటార్ సైకిల్ కు పెట్రోలు ఖర్చు ఎక్కువ అవుతోందని గ్రహించాడు. తనవద్ద పనిచేసేవాళ్ళు అవసరం అనుకున్నప్పుడు బైటకు వెళ్ళి రావాలంటే పెట్రోలు ఖర్చు తడిసి మోపెడు అవుతుందని గ్రహించి తన మోటార్ సైకిల్‌ను ఎలక్ట్రిక్ వాహనం (ఇ.వి.) గా మార్పు చేశాడు. ప్రస్తుతం ఈ వాహనం కేవలం 3–4 గంటల సేపు ఛార్జింగ్ చేసుకున్నట్లయితే 50 కి.మీ. వేగంతో రోజుకు 80–90 కిలో మీటర్ల దూరం చాలా తక్కువ (కరెంటు) ఖర్చుతో తమ ప్రయాణాన్ని కొనసాగించ వచ్చు. రైతులు ఎక్కువగా తమ పొలాలకు వెళ్ళటం, అత్యవసరమైతే సమీప పట్టణాలకు వెళ్ళటం చేస్తూ ఉంటారు. ఈ దూరం అంతా కలిపితే 80–90 కి.మీ. కన్నా ఎక్కువ ఉండదు. కాబట్టి రాత్రిపూట లేదా ఉదయం లేవగానే ఛార్జింగ్ చేసుకుని రోజంతా హాయిగా పెట్రోలు ఖర్చు లేకుండా వాహనం నడుపుకోవచ్చు.

కాబట్టి ఇప్పటికే మోటార్ సైకిల్ ఉన్న రైతులు, గ్రామస్తులు తమ మోటార్ సైకిల్‌ను కేవలం ఒకటి రెండు రోజుల్లో ఎలక్ట్రిక్ వాహనంగా మార్చుకుని, పెట్రోలు ఖర్చును ఆదా చేసుకోవాలని సూచిస్తోంది 'పల్లెసృజన'. ●




# సేంద్రియ వ్యవసాయం

**పరిచయం:**

సేంద్రియ వ్యవసాయం అంటే పర్యావరణానికి హాని చెయ్యకుండా, సహజమైన వనరులను ఉపయోగించి సాగు చేసే విధానం. ఇది మన దేశంలో ప్రాచీన కాలం నుంచే ఉన్న పద్ధతి.

ఈ విధానంలో మొక్కలు, పశువులు, మనుషులు, భూమి - వీటన్నిటి ఆరోగ్యాన్ని కాపాడుత, సహజ వనరులను వాడి పంటలు పండిస్తారు. రసాయన ఎరువులు లేదా విష పదార్థాలు కాకుండా, పంట అవశేషాలు, పశువుల ఎరువు, బయో ఫర్టిలైజర్లు, సూక్ష్మజీవులు వంటివి వాడుతారు.

**సేంద్రియ వ్యవసాయ నాలుగు ప్రధాన సూత్రాలు:**

1. **ఆరోగ్య సూత్రం :**
   నేల, మొక్క, పశువు, మనిషి, భూమి - ఇవన్నీ పరస్పర సంబంధం కలిగినవి. ఎరువులు, పురుగు మందులు, రసాయన పదార్థాలు వాడకుండా వాటి ఆరోగ్యాన్ని కాపాడటం ప్రధాన లక్ష్యం.
2. **పర్యావరణ సూత్రం :**
   ప్రకృతి వ్యవస్థలతో కలసి పని చేయడం, వాటిని అనుకరించడం, సంరక్షించడం ముఖ్యం. నేల, నీరు, గాలి, వాతావరణం, జంతువులు, మొక్కలు - ఇవన్నీ కలిసి జీవ వైవిధ్యాన్ని కాపాడాలి.
3. **న్యాయ సూత్రం :**
   రైతు, వ్యాపారి, వినియోగదారుడు - అందరికీ న్యాయం జరిగే విధంగా ఉత్పత్తి మరియు వ్యాపారం జరగాలి. పర్యావరణం, సమాజానికి నష్టం జరగకూడదు.

| అంశం | సేంద్రియ వ్యవసాయం | రసాయన వ్యవసాయం |
|---|---|---|
| వనరులు | స్థానిక, సహజ వనరులు | బయట కొనుగోలు చేసే రసాయనాలు |
| ఖర్చులు | తక్కువ, స్వయంపరిపూర్ణం | ఎక్కువ, ఆధారపడే విధానం |
| సమాజం | సహకారం, భాగస్వామ్యం | వ్యక్తిగత లాభం మాత్రమే |
| ప్రకృతితో | ప్రకృతితో సఖ్యత | ప్రకృతిపై ఆధిపత్యం |
| పంటల వైవిధ్యం | విభిన్న పంటలు | ఒక్కటి లేదా రెండు పంటలు మాత్రమే |
| రైతుదృక్పథం | దీర్ఘకాల సుస్థిరత | తాత్కాలిక లాభం |

4. **జాగ్రత్త సూత్రం :**
   మనం చేసే వ్యవసాయం ఈ తరం మాత్రమే కాక, భవిష్యత్ తరాలకూ ఉపయోగ పడాలి. నిర్ణయాలు పారదర్శకంగా, అందరి మేలుని దృష్టిలో ఉంచుకుని తీసుకోవాలి.

**సేంద్రియ వ్యవసాయం సంప్రదాయ (రసాయన) వ్యవసాయం:**

**పోషక నిర్వహణ:**

- సేంద్రియ రైతులు జీవపదార్థాలు (కంపోస్టు, వెర్మి కంపోస్టు, గ్రీన్ మెన్యూర్) వాడుతారు.
- పంట మార్పిడి, కవర్ క్రాపింగ్, తక్కువ దున్నడం ద్వారా నేలలో కార్బన్ నిల్వ పెరుగుతుంది.
- ఎరువులుగా పశు ఎరువు, పంట అవశేషాలు, ఎముకల పొడి, గానుగ చెక్క, బయో ఫర్టిలైజర్లు, రాక్ ఫాస్ఫేట్, లైమ్ వంటివి వాడుతారు.
- సూక్ష్మ జీవులు నేలలోని సేంద్రియ పదార్థాలను పోషకాలుగా మారుస్తాయి.
- పశు ఎరువు లేకుంటే నేల జీవక్రియలు తగ్గి పంట దిగుబడి తగ్గుతుంది.

**పురుగు మరియు వ్యాధి నియంత్రణ:**

- సేంద్రియ వ్యవసాయలో రసాయన పురుగు మందులు నిషేధం.
- నివారణ, పర్యవేక్షణ, అవసరమైనప్పుడు బయో పీడక మందులు వాడడం ద్వారా నియంత్రణ.
- స్థానిక పరిస్థితులకు సరిపోయే సహజ పద్ధతులు ఉపయోగించడం.
- వ్యర్థాలు తగ్గించడం, శక్తి పొదుపు చేయడం, కాలుష్యాన్ని తగ్గించడం ప్రధాన లక్ష్యం.

**గడ్డి నియంత్రణ:**

- పంటలకు పోషకాలు, నీరు, కాంతి కోసం గడ్డి పోటీ ఇస్తుంది. దీంతో పంట దిగుబడి 33% వరకు తగ్గుతుంది.
- సేంద్రియ పద్ధతిలో ఇంటిగ్రేటెడ్ వీడ్ మేనేజ్‌మెంట్ వాడుతారు.
- **భౌతిక -** చేతితో, యంత్రంతో తీయడం.
- **సాంస్కృతిక -** పంట మార్పిడి, మల్చింగ్
- **జీవ -** బయో హెర్బిసైడ్స్ వాడటం వంటి పద్ధతులను కలిపి వాడుతుంది.



**సేంద్రియ వ్యవసాయ నిర్వహణ:**

- నేల ఆరోగ్యానికి పంట అవశేషాలు, పశు ఎరువు, మూత్రం, బయో ఫర్టిలైజర్లు ఉపయోగించాలి.
- నేల నుండి తీసుకున్న జీవ పౌష్టికాలు(బయోమాస్)ను తిరిగి నేలకే ఇవ్వాలి.
- పంచగవ్య, దశగవ్య, బైడైనమిక్ కంపోస్టు, వెర్మి వాష్ వంటివి నేల సారాన్ని పెంచుతాయి.
- రాక్ ఫాస్ఫేట్, లైమ్, ఆయిల్ కేక్స్, పౌల్ట్రీ మెన్యూర్ వంటివి తక్కువ ఖర్చుతో అధిక పోషణ ఇస్తాయి.

**పంట అనంతర నిర్వహణ:**

- పంట కోసిన తరువాత సరైన విధంగా గ్రేడింగ్, ప్యాకింగ్, నిల్వ, రవాణా చేయకపోతే భారీ నష్టం జరుగుతుంది.
- భారతదేశంలో 2019లోనే సుమారు రూ. 93,000 కోట్ల విలువైన పంటలు నష్టపోయాయి.
- సరైన నిర్వహణ లేకపోవడం వల్ల పంట నుండి తినే వరకు ఆహార నాణ్యత తగ్గుతుంది.
- రైతులు సరైన నిల్వ, రవాణా విధానాలు నేర్చుకోవాలి.

**సేంద్రియ ధృవీకరణ మరియు మార్కెటింగ్:**

భారతదేశంలో రెండు రకాల ధృవీకరణ విధానాలు ఉన్నాయి.

1. **ఎన్‌పిఓపి (థర్డ్ పార్టీ సర్టిఫికేషన్):**
   - ఎపిఇడిఎ, వాణిజ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో
   - ప్రధానంగా ఎగుమతుల కోసం.
2. **పిజిఎస్-ఇండియా సర్టిఫికేషన్ (పార్టిసిపేటరీ గ్యారంటీ సిస్టం):**
   - వ్యవసాయ & రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో
   - దేశీయ మార్కెట్ కోసం.
   - తక్కువ ఖర్చుతో, సన్న, చిన్న రైతులకు అనుకూలంగా.
   - 2011లో నేషనల్ సెంటర్ ఆఫ్ ఆర్గానిక్ ఫార్మింగ్ (ఎన్‌సిఓఎఫ్), ఘాజియాబాద్ ద్వారా ప్రారంభించబడింది.

**రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పిఓ లు) - ఆత్మనిర్భర్ రైతుదిశగా:**

- ఎఫ్‌పిఓ అంటే రైతులు కలిసి కంపెనీ లేదా సహకార సంఘం రూపంలో ఏర్పడి ఉత్పత్తి, మార్కెటింగ్‌లలో కలిసి పని చేయడం.
- ప్రభుత్వం "10 వేల ఎఫ్‌పిఓలు ఏర్పరచడం" అనే పథకాన్ని 2027-28 వరకు అమలు చేస్తోంది.
- ఇది "ఒక జిల్లా ఒక ఉత్పత్తి" (వన్ డిస్ట్రిక్స్ వన్ ప్రాడక్ట్) విధానంలో, ప్రతి జిల్లాకు ప్రత్యేక ఉత్పత్తిమీద దృష్టి సారిస్తుంది.
- దీని ద్వారా రైతులు కలసి పనిచేసి – పెద్ద స్థాయి ఉత్పత్తి, మంచి ధరలు, స్థిరమైన ఆదాయం పొందవచ్చు.

## ప్రకృతి వ్యవసాయం

**పరిచయం:**

ప్రకృతి వ్యవసాయం అంటే ఎలాంటి రసాయనాలు వాడకుండా, పంటలు, చెట్లు, పశువులను సమన్వయంగా పెంచే వ్యవస్థ. ఇది ప్రకృతి ఆధారిత పద్ధతులపై ఆధారపడుతుంది. రైతులు తమ క్షేత్రంలో ఉన్న వనరులను ఉపయోగించి పశువుల మూత్రం, ఎరువు మొదలైన వాటితో తయారు చేసిన ద్రావణాలను (ఉదా.: జీవామృతం, బీజామృతం) వాడుతారు. ముఖ్యంగా దేశీ ఆవు ఈ వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తుంది.

**ప్రకృతి వ్యవసాయం యొక్కభావం:**

ఇది పంటలు, చెట్లు, పశువులను కలిపి సాగు చేసే విభిన్న వ్యవసాయ పద్ధతి. ఇది నేల సారాన్ని పెంచుతుంది, పర్యావరణాన్ని రక్షిస్తుంది, మరియు రైతుల ఆదాయాన్ని పెంచుతుంది. ప్రకృతిలో ఉండే సహజ ప్రక్రియలనే ఉపయోగించి పంటలు పండించడమే దీని సారాంశం.

**ప్రధాన లక్షణాలు:**

- మొక్కలకు కావలసిన పోషకాలలో 98% వాయువు, నీరు, సూర్యకాంతి నుండి వస్తాయి. మిగతా 2% నేలలో ఉన్న సూక్ష్మజీవుల ద్వారా వస్తుంది.
- నేల ఎప్పుడూ ఎండిపోకుండా పచ్చి ఎరువుతో (మల్చ్‌తో) కప్పాలి.
- జీవామృతం, బీజామృతం వంటి రైతులు తయారు చేసే బయో ద్రావణాలను నేలలో వేస్తారు. ఇవి దేశీ ఆవు ఎరువు, మూత్రంతో తయారవుతాయి.
- ఎటువంటి రసాయన ఎరువులు లేదా కీటక నాశకాలు వాడరు.



పంటలపై మల్చింగ్





- నేలను దున్నడం, తిప్పడం, గడ్డి తీయడం వంటి పనులు చేయరు. ప్రకృతిలో ఉన్నట్టే వదిలేస్తారు.
- పీడకులను నియంత్రించడానికి దశపర్ణి, ఆర్క్, వేప వంటి సహజ ద్రావణాలు వాడతారు.
- గడ్డిని కూడా వాడే విధంగా ఉంచుతారు – అది నేల కప్పుగా (మల్చ్‌గా) ఉపయోగ పడుతుంది.
- ఒక్క పంటకన్నా బహుళ పంటలు (మల్టీ క్రాపింగ్) పండించడం ప్రోత్సహించబడుతుంది.

**ప్రకృతి వ్యవసాయ సూత్రాలు:**

- నేలలో ఎరువులు వేయరు; నేలపైనే సూక్ష్మజీవులు, పురుగులు ఆహారాన్ని తయారు చేస్తాయి.
- నేల సజీవంగా ఉంచడం ముఖ్యం. జీవామృతం, బీజామృతం, ఘన జీవామృతం వంటి ద్రావణాలు నేల సారాన్ని పెంచుతాయి.
- ఆవు ఎరువు, మూత్రం మరియు పరిశుభ్రమైన నేల వాడి ఇవి తయారు చేస్తారు.

**ప్రకృతి వ్యవసాయ పరిధి:**

భారతదేశంలో వివిధ రాష్ట్రాలు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్స హిస్తున్నాయి. అందులో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, గుజరాత్ ముందంజలో ఉన్నాయి. ఇతర రాష్ట్రాలు ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, ఉత్తరాఖండ్ కూడా ప్రోత్సహి స్తున్నాయి.

ఇది నేల సారాన్ని పెంచుతుంది. వాతావరణ మార్పులను తగ్గిస్తుంది. రైతుల ఆదాయాన్ని పెంచతుంది. భవిష్యత్ తరాల కోసం భూమిని రక్షించే ఉత్తమ పద్ధతిగా ఇది భావించబడుతుంది.

## రైతు మిత్రుడు వానపాము విశిష్టత – సుభాష్ పాలేకర్

**పద్మశ్రీ సుభాష్ పాలేకర్ గారికి కృతజ్ఞతలతో.....**

స్థానిక వానపాము యొక్క నిర్వచనం నేను ఈ విధంగా ఇచ్చాను.

ఇది ఒక పురుగు. ఇది స్థానిక వాతావరణంలో జీవిస్తుంది. విస్తారంగా నేల కణాలు, ఇసుక కణాలు, ఎరువు లేదా పువ్వు రంగు రాయి కణాలు, ఇసుక రాళ్ళు, సేంద్రియ పదార్థం తింటుంది మరియు వ్యాధి కారక జీవులను నాశనం చేస్తుంది.

ఇది నేలను సుమారు 15 అడుగుల లోతు వరకు త్రవ్వి, దానిని తడిగా ఉంచుతుంది. నేలను దున్నుతుంది, సాగు చేస్తుంది. ఇది లోతైన ఖనిజాలతో నిండిన నేలను నేల పైభాగంలో ఉంచుతుంది. వీటిని 'కాస్టింగ్స్' అంటారు. ఇవి మొక్కల వేర్లకు అందుబాటులో ఉంటాయి. ఇది వర్షపు నీటిని నేలలో నిల్వ ఉంచుతుంది. దానిని వేర్లకు అందిస్తుంది.



ఆహారం లభించకపోతే, ఇది ఇతర పొలాలకు పారిపోదు లేదా పొలం విడిచి వెళ్ళదు. కానీ నేల లోతైన భాగంలోకి వెళ్ళి సమాధి స్థితిలోకి వెళ్తుంది. ఇది రోగకారక సూక్ష్మజీవులను తింటుంది. ఇవి మొక్కలకు వ్యాధులను కలిగించి చంపుతాయి. ఇది ఇతర జీవుల విసర్జ నను తినదు. ఇది నేల యొక్క నిర్మాణము, ఆకృతి మరియు జీవ వైవి ధ్యాన్ని మెరుగు పరుస్తుంది. ఇది నేలను కుదించబడకుండా నిరోధి స్తుంది. ఇది చాలా తక్కువ సేంద్రియ పదార్థం తక్కువ నేల కణాలను తింటుంది.

ఇది నేలయొక్క భౌతిక మరియు రసాయనిక లక్షణాలను మాత్రమే కాకుండా, మొత్తం నేల జీవ వ్యవస్థను కడా అభివృద్ధి చేస్తుంది.

ఇవి పైకి, క్రిందకు కదలికల ద్వారా అనేక సొరంగాలు మరియు బిలాలను తయారు చేస్తాయి. ఇవి వర్షాన్ని నియంత్రిస్తాయి మరియు నేలలో తగినంత గాలి ప్రవాహాన్ని కల్పిస్తాయి. తద్వారా వేర్లకు మరియు సూక్ష్మజీవులను తగినంత ఆక్సిజన్ అందుతుంది.

ఇవి నత్రజని (నైట్రోజన్) మరియు ఆక్సిజన్‌ను ఇతర జీవులకు తరలించే మార్గాలను సృష్టిస్తాయి. నేల జీవులకు అనుకూల మైన వాతావరణాన్ని ఏర్పరుస్తాయి.

ఇవి తమ శరీరంలోని ద్రవ స్రావాన్ని నేలలోని సొరంగాల గోడలపై స్ప్రే చేస్తాయి – అందులో వృద్ధి హార్మోన్లు, ప్రొటీన్లు, అల్కలాయిడ్లు మొదలైన అనేక పోషక పదార్థాలుంటాయి. ఇవి మొక్కల మరియు నేల సూక్ష్మజీవుల పెరుగుదలకు అత్యంత అవసరమైనవి.

**సౌజన్యం : 'పద్మశ్రీ' సుభాష్ పాలేకర్ గారి ఆంగ్ల గ్రంథం "ఫిలాసఫీ, ప్రిన్సిపుల్స్, టెక్నాలజీ" నుంచి అనువాదం**

# 'పునాది స్థాయి ఇన్నోవేషన్ల'తో గ్రామీణ యువతకు స్వయం ఉపాధి



- వీరరాఘవ రెడ్డి

గ్రామల్లో యువతీ యువకులు వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు, ఇతర కారణాల రీత్యా ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే మన దేశంలో ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత స్థాయి చదువులకు వెళ్తున్న యువత కేవలం 23 శాతం. అంటే 77 శాతం యువత ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ఎంతోమంది ఉపాధి కోసం ఎదురు చూపులు చూస్తున్న సంగతి అందరికీ విదితమే. తమ చదువుకు తగిన ఉపాధి లభించటం లేదని కొందరు, ఏదైనా ఉద్యోగం సాధిద్దామంటే తగినంత చదువు చదవలేక పోయామే అని కొందరు, ఏదైనా వ్యాపారం చేసుకుందామంటే బ్యాంకులు ఎలాంటి తనఖా లేకుండా తమకు రుణం ఇవ్వటం లేదని కొందరు..... ఇలా ఎన్నో రకాలుగా ఆలోచిస్తూ, ఏమి చెయ్యాలో తెలీక నిస్సహాయంగా గ్రామ యువత కాలం గడుపుతున్నారు.

ఇలాంటి యువత కొరకు తమ గ్రామంలోనే వుండి, తాము తల్లిదండ్రులపైన ఆధార పడకుండా తమ ఖర్చులకు అవసరమైన ధనాన్ని తామే సంపాదించుకోవటంతో పాటు తామే కుటుంబానికి కాస్త చేదోడుగా తయారవుతూ, తమను తిట్టిన నోళ్ళే పొగిడేలా తయారు కావడానికి అవసరమైన ఎన్నో పునాది స్థాయి ఇన్నోవేషన్లను 'పల్లెసృజన' వెలుగులోకి తెచ్చింది. ఏ పని చేస్తున్నామన్నది ముఖ్యం కాదు, తాము చేస్తున్న పని ఎంత మందికి ఉపయోగ పడుతున్నది, దానివల్ల తాము ఎంత సంపాదిస్తున్నాము, గతంకన్నా ఇప్పుడు మనపైన ఎంత గౌరవం పెరిగింది అన్నది ఆలోచిస్తే చాలు మీ భవిష్యత్తును మీరే తీర్చి దిద్దుకున్నవారు అవుతారు. ఈ పరంపరలో 2021 జులై–ఆగస్టు సంచిక నుండి యువత ఉపాధి కొరకు వెలుగులోకి వచ్చిన ఇన్నోవేషన్లను గురించి తెలియజేస్తోంది 'పల్లెసృజన'.

## గ్రామీణ రవాణా వ్యవస్థ

## బైక్ ఉంటే చాలు - ఊళ్లోనే ఉపాధి ఇస్తున్న పునాది స్థాయి ఇన్నోవేషన్లు

పిల్లల పట్ల తల్లిదండ్రుల ప్రేమ అపారమైనది. ఈ అపారమైన ప్రేమతో పిల్లల కోరిక మేరకు వారికి అవసరమైన మోటార్ సైకిల్ తమకు ఎంత కష్టమైనా కొనిపించే తల్లిదండ్రులు ఎక్కువ. అలా మోటార్ సైకిల్‌ను పొంది, జులాయిగా పట్టణాలకు తిరుగుతూ గ్రామంలో చెడ్డ పేరు తెచ్చుకోకుండా దానికో చిన్న అనుసంధాన పరికరాలు ఏర్పాటు చేసుకుంటే చాలు, ఎంతోమంది సమస్యలకు పరిష్కారం చూపటంతో పాటు, మీకు ఉపాధి – గ్రామంలో మంచి పేరు రెండూ పొందటంతో పాటు, తల్లిదండ్రులు కూడా తాము మోటార్ సైకిల్ కొని ఇచ్చినందుకు మావాడికి మంచి ఉపాధి లభించింది అని వాళ్ళు కూడా సంతోషిస్తారు. ఇలా "గ్రామీణ రవాణా వ్యవస్థ"ను మీరు అభివృద్ధి చేసిన వారవుతారు.

ఈ గ్రామీణ రవాణా వ్యవస్థ కోసం కనుగొనబడిందే "మోటార్ సైకిల్ ట్రాలీ". ప్రస్తుత పరిస్థితుల్లో పొలం పనులు చేసేందుకు గ్రామాల్లో కూలీలు దూరంగా వున్న పొలాలకు నడిచి వెళ్ళలేని పరిస్థితులు ఉన్నాయి. అటువంటి రైతులు కూలీలను తరలించేందుకు ఆటోలు, ట్రాక్టర్లను ఆశ్రయిస్తూ వుంటారు. కొందరికి అవి లభించే అవకాశం కూడా వుండదు. అటువంటి వారికి మీరు సహకరించవచ్చు. ఈ మోటార్ సైకిల్ ట్రాలీలో వారికి అవసరమైన కూలీలను వారి పొలాలకు





చేర్చటం, పొలానికి తీసుకు వెళ్ళ వలసిన ఎరువులు ఇతర సామాగ్రిని చేర్చటం, పొలం నుండి వారి వ్యవసాయ దిగుబడులను ఇంటికి చేర్చడం లాంటి రవాణా సదుపాయాలు మీరు కల్పిస్తే, ఆ రైతు మీకు ఎంతోకొంత నగదు రూపేణా అందిస్తాడు. అది కూడా ఎంతో తృప్తిగా ఇస్తాడు. కొన్ని ఊర్లల్లో బస్టాండు చాలా దూరం వుంటుంది. అటువంటప్పుడు బస్సు దిగే, ఎక్కే ప్రయాణీకులను కూడా రవాణా చేయవచ్చు. మీ సంపాదన కూడా నిజాయితీతో పాటు ఆ రైతు తృప్తిగా ఇచ్చే ప్రతిఫలం వల్ల వచ్చే ఆనందమే వేరబ్బా.....

ఇందుకు మీరు చేయవలసింది కేవలం ఒక "బైక్ ట్రాలీ"ని కొనుగోలు చేయటమే. అది మీ బైక్ ఖరీదు కంటే చాలా తక్కువ. మీ బైక్‌కు ఎలాంటి అదనపు మార్పు చేర్పులు అవసరం లేకుండా అవసరం అయినప్పుడు ఆ ట్రాలీని మీ బైక్‌కు తగిలించుకుని పైన చెప్పిన పనులన్నీ చేసుకోవచ్చు. ఈ పనులన్నీ ఉదయం, సాయంత్రం వేళల్లో ఎక్కువగా వుంటాయి. మిగతా సమయంలో మీ ఆనందాన్ని మీరు అనుభవించ వచ్చు. మీ తల్లిదండ్రులకు కూడా పొలం వెళ్ళేందుకు చేదోడు కావచ్చు.

తాము ఉన్న ప్రాంతం లేదా గ్రామంలో ఈసడించుకున్న చోట గౌరవింప బడటం వల్ల ఎంతటి మనోల్లాసం పెరుగుతుందో ఒక్కసారి ఆలోచించండి. నగరాల్లో, పెద్ద పట్టణాల్లో 'పోర్టర్' అనే యాప్ ద్వారా మనం లగేజీని ఎక్కడికైనా పంపాలన్నా, ఎక్కడినుంచైనా తెచ్చుకోవాలి అన్నా ఆ యాప్ లో నమోదు చేస్తే చాలు. అందులో మోటార్ సైకిల్ నుంచి లారీ వరకు అన్ని రకాల వాహనాలు వుంటాయి. మన లగేజి





బరువును బట్టి మనకు కావలసిన వాహనాన్ని ఎన్నుకుంటే వారే ఎక్కడికి కావాలో అక్కడికి చేరవేస్తారు. ఈ యాప్ ద్వారా ఎంతోమంది యువత తమ మోటార్ సైకిల్‌పై చిన్న చిన్న లగేజీలను చేరవేస్తూ అదనపు ఆదాయాన్ని పొందుతున్నారు. అలా మీరు కూడా మీ పనులతో పాటు ఇలా గ్రామీణ రవాణా ఏర్పాటు చేసుకోగలగితే అదనపు ఆదాయం పొందవచ్చు.

అలాగే కొందరు చిన్న చిన్న కమతాలు వున్న రైతులు తమ పొలంలో వేసిన పంటకు అంతర సేద్యాలు చేసుకోలేక, వాటి కొరకు ఎద్దులను, ట్రాక్టర్లను కిరాయికి తీసుకోలేక సతమతం అవుతుంటారు. ఎందుకంటే తనకున్న అర ఎకరం లేదా ఎకరం పొలం దున్నటానికి ఎద్దులు వున్న కిరాయిదారుడు రాడు. దానికి కారణం వేరే ఎక్కువ పొలం వున్న వారికి వెళ్తే రోజంతా పని వుంటుంది, కిరాయి పూర్తిగా వస్తుంది. కానీ చిన్న వారి పొలానికి వెళ్తే వారివద్ద పూర్తి కిరాయి తీసుకోవటం కుదరదు. పైగా త్వరగా పని అయిపోతుంది. ఇలాంటి వాళ్ళు ఇద్దరు ముగ్గురు రైతులు కలుసుకుని కిరాయికి మాట్లాడుకున్నా, ఒక్కో పొలంలో వేర్వేరు పనులు వుంటాయి, వాటికి తగిన పరికరాలు తెచ్చుకోవాలి. ఇలాంటి ఇబ్బందులు చాలా వుంటాయి. అటువంటి వారికోసమే మోటార్ సైకిల్‌కు అనుసంధానం చేసుకునే వ్యవసాయ పనిముట్లను వెలుగులోకి తెచ్చింది 'పల్లెసృజన' వాటిని మీరు ఏర్పాటు చేసుకున్న ట్లయితే ఆడుతూ పాడుతూ వారి పొలాన్ని మీ మోటార్ సైకిల్‌తో రూపు మార్చే అవకాశంతో పాటు, మీకు గౌరవము, ఉపాధితో పాటు ఎందరికో మేలు చేసిన వాళ్ళవుతారు. ఆలస్యం చేయక వెంటనే మీ ఉపాధి మీరే పొందండి. మీ ఊర్లోనే వుంటూ, మీ ఆనందాన్ని అనుభవిస్తూ, ఇతరులకు సహాయం చేయటం ద్వారా మీ ఉపాధి మీరే కల్పించుకోండి. ఇలా మీ మోటార్ సైకిల్ తోనే చేసే ఎన్నో పరిష్కారాలను మీకు అందించటా నికి ఎప్పుడూ సిద్ధంగా వుంటుంది 'పల్లెసృజన'.

ప్రతి గ్రామంలోని యువకులు తమ మోటార్ సైకిల్‌లను గ్రామీణ రవాణాకు ఉపయోగ పడేలా తయారు చేసుకున్నట్లయితే గ్రామస్తులకు కూడా తక్కువ ఖర్చుకే తమ సరుకుల రవాణా జరుగు తుంది. అలాగే మీ తల్లిదండ్రులకు మీ బైక్ పెట్రోలు పోయించే ఖర్చు తగ్గుతుంది. ఇలా గ్రామీణులకు సహకారం అందజే యటంతో పాటు యువత అదనపు ఆదాయాన్ని సమకూర్చుకుంటుం దని ఆశిద్దాం.

**వివరాల కొరకు సంప్రదించండి : వీరరాఘవ రెడ్డి, 8125799904, సుభాష్ చందర్, 9652801700**

ఎటువంటి సహకారం పొందకుండా చేసిన పునాది సాంకేతిక ఇన్నోవేషన్‌లు మరియు అత్యుత్తమ సాంప్రదాయ జ్ఞానంలో

# 15 వ జాతీయ ద్వైవార్షిక పోటీలు

## మీవద్ద ఏదైనా తక్కువ ఖర్చుతో పర్యావరణానికి హాని చెయ్యని స్థిరమైన, మేలైన జీవితాలనిచ్చే ఆలోచన / ఇన్నోవేషన్ ఉన్నదా?

- వ్యవసాయం
- ఇంజనీరింగ్
- శక్తి (ఇంధనం)
- ఆరోగ్యం
- రోజువారి పనుల సహాయకారి
- పశువులు
- రవాణా
- మరేదైనా రంగలో శ్రమను తగ్గించి, ఉపాధి అవకాశాలను పెంచి, తద్వారా స్థిరమైన ప్రభావం చూపగలిగేవి

**ఎవరికీ ఆహ్వానం?**

సాంకేతిక ఇన్నోవేషన్‌లకి
సృజనాత్మక ఆలోచనలు
అత్యుత్తమమైన సాంప్రదాయ జ్ఞానం
(ఎవరి సహాయం లేకుండా స్వంతంగా చేసి, కొత్తగా ఉండి, శాస్త్రీయంగా నలుగురికీ పనికి వచ్చేలా ఉండాలి)

ఎంపికైన ఇన్నోవేషన్‌లకి అభివృద్ధి చేసుకునేందుకు సహాయం అందజేయ బడుతుంది.

**ఎవరు పాల్గొన వచ్చును?**
పూర్తి వివరాలు తెలుసుకోవడానికి
ఈ క్రింది వెబ్‌సైట్ ను సంప్రదించండి
**https // nif.org.in/biannual_campaign**

అర్హత ఉన్న వ్యక్తులు, గుంపులు
ఎన్నైనా దరఖాస్తులు (పరిమితి లేకుండా)
ఈ క్రింది చిరునామాకు పంపవచ్చు.

**దరఖాస్తులు ఏడాది పొడవునా మార్చి 31, 2027 వరకు అంగీకరించబడును**

మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :

**National Innovation Foundation - India,**
C/o Gram Bharati, Amrapur, Gandhi Nagar-Mahudi Road,
Gandhi Nagar, Gujarat-382 721.
Email: campaign@nifindia.org, Website: www.nif.org.in

राष्ट्रीय नवप्रवर्तन प्रतिष्ठान - भारत
National Innovation Foundation - India
An Autonomous Institute of Department of Science & Technology
Ministry of Science and Technology, Government of India

Follow us on

https://nif.org.in campaign@nifindia.org



# చిరు ధాన్యాల పంటల అభివృద్ధిలో విజయ కుమార్ విజయ పరంపర

- వీరరాఘవరెడ్డి

మార్కెట్‌లో చిన్న పిల్లలకు బలవర్ధకమైన ఆహారం తయారు చేసే కర్మాగారాలు ఎన్నో ఉన్నాయి. ఆయా సంస్థల వారు తమ ఉత్పత్తులను మార్కెట్ చేసుకోవటానికి 'మా పౌడర్‌లో స్వచ్ఛమైన గోధుమలు, బార్లీ, మినుములు, పెసర లాంటి చిరు ధాన్యాలతో తయారైన స్వచ్ఛమైన, చిన్న పిల్లలో శారీరక శక్తిని పెంచే ఆహారం' అంటూ ప్రచారం చేసుకుంటూ వుంటారు. రెడీమేడ్ ఆహారానికి అలవాటు పడ్డ సమాజం కూడా దాన్ని నమ్మి ఆ పౌడర్లను కొనుగోలు చేసి, తమ పిల్లలకు ఆహారంగా అందిస్తున్నాయి. కానీ, ఈ ఆహార పొడులలో కలిపే చిరుధాన్యాలు అన్నీ గ్రామాల్లో పండేవే అని మర్చిపోయేంతగా వారి ప్రచారం సాగుతున్న తరుణంలో కడప జిల్లా, వేంపల్లె మండలం, పి.ఎలమవారి పల్లె గ్రామానికి చెందిన "కొమ్మూరి విజయ కుమార్" ఇందులోని సూక్ష్మ



ప్రచారాన్ని కనుగొని, సమాజానికి నేరుగా ఈ ఆహార పదార్థాలు అందించటం వల్ల చిన్నారుల్లోనే కాదు, అన్ని వయసుల వారు ఈ ఆహారాన్ని తీసుకుంటే శరీరంలో పెరిగే శక్తితో పాటు రోగ నిరోధక శక్తి కూడా అపారం. ఈ విషయాలను రైతులకు తెలియ జేయటంతో పాటు, వారిని ప్రోత్సహించి, చిరు ధాన్యాలు పండించేం దుకు పురిగొల్పాడు. ముందుగా కనీసం మీ కుటుంబం కోసమైనా కొంత చిరుధాన్యాలు విత్తుకోండి, ఆ తర్వాత వీటికి మార్కెట్ తప్పకుండా పెరుగుతుంది. అప్పుడు పెద్దయెత్తున పండించి, తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందవచ్చు అని వారిలో నమ్మకాన్ని పెంచే కార్యక్రమంలో ఎన్నో వ్యవసాయ ప్రదర్శనలు, శిక్షణా కేంద్రాలకు తానే స్వయంగా వెళ్ళి వారికి 'చిరు ధాన్యాల' పట్ల అవగాహన పెంపొందించాడు.

ఈ విషయాన్ని గమనించిన ప్రభుత్వ వ్యవసాయ అధికారులు కూడా తాము నిర్వహించే వ్యవసాయ శిక్షణా శిబిరాలకు ప్రత్యేకంగా విజయకుమార్‌ను పిలిపించి, వాటిపైన అవగాహనను పెంపొందించేందుకు తమవంతు తోడ్పాటును అందించారు. ఈ కార్యక్రమం కేవలం తన జిల్లాకే పరిమితం కాకుండా, పొరుగు జిల్లాలైన అనంతపురం, చిత్తూరు, కర్నూలు, నెల్లూరులతో పాటు, నాటి సమైఖ్య ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాద్‌కు కూడా వెళ్ళి తన వాక్చాతుర్యంతో రైతులను ఉద్యుక్తులను చేశారు. అంతే కాదు పొరుగు రాష్ట్రాలైన కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు లకు కూడా వెళ్ళటం జరుగుతోంది.

ఇదంతా ఒక దశాబ్ద కాలం పాటు జరిగింది. ఇప్పుడు "చిరు ధాన్యాలు" గురించి ఎంతోమంది ఆహార నిపుణులు ఏయే ఆహారం తింటే ఎటువంటి బలం వస్తుంది, వాటిని పండించడానికి అయ్యే ఖర్చు ఎంత? వాటిని పండించటం వల్ల లాభం ఎంత? అన్న వివరాలు తెలియ



జేయటంతో ప్రస్తుతం ఈ చిరు ధాన్యాల సాగు బాగా పెరిగి పోయింది. ఈ పంపరను ఇంకా పెంచటానికి తాను పండించిన దాదాపు రెండున్నర టన్నుల ధాన్యాన్ని రైతులకు ఉచితంగా పంపిణీ చేశాడు. ఈ పంపిణీ చేయటం కూడా చాలా చాకచక్యంగా చేశాడు. ఎవరైనా రైతు తనకు 4 ఎకరాలు విత్తుకోవటానికి ధాన్యం పంపమంటే పంపడు. కేవలం ఒకటి లేదా రెండు కిలోల ధాన్యం పంపి, ముందుగా వీటిని విత్తుకొని, ఆ విత్తనం పండివచ్చిన తర్వాత నీ విత్తనాన్ని నీవే కావలసినంత పొలంలో విత్తుకోమని సలహా ఇచ్చి, రైతును తన విత్తనం తానే తయారు చేసుకునే విధంగా మేల్కొలుపుతున్నాడు. ఇంతకంటే గొప్ప ప్రోత్సాహిక ప్రేరణ ఉంటుందా!

**ఉదాహరణకు ఒక్కసంఘటన ఇక్కడ తెలియజేస్తున్నాము:**

హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసుకునే రాజేశ్వరి అనే ఒక మహిళ ఈ చిరు ధాన్యాలను గురించిన వ్యాసాలను పరిశీలనగా చదివి, తన చిన్న కుమారుడికి ఈ ఆహారాన్నే తినిపించాలి, మార్కెట్‌లో పౌడర్‌లను తెచ్చి పెట్టకూడదు అని నిర్ణయించుకుంది. చిరు ధాన్యాలతో పాటు మరి కొన్ని వ్యవసాయ ఉత్పత్తులను సేకరించి, తానే స్వయంగా ఒక పొడిని తయారు చేసి తన బిడ్డకు తినిపించింది. అబ్బాయికి 6 నెలల వయసు నుండి ఆమె తయారు చేసిన ఆహారం తినిపిస్తోంది. ఒకటిన్న సంవత్సరాలు కూడా దాటని చిన్నారి మూడున్నర కిలోల బరువును అవలీలగా ఎత్తుకొని ఆడుకోవటం చూసిన ఆ చిన్నారి బలం చూస్తే పెద్దవారికే ఆశ్చర్యం వేసింది. అంతటి పోషక విలువలు గలవి మన "చిరు ధాన్యాలు" అని ప్రపంచానికి చాటి చెప్పిన విజయ కుమార్ ఎంతో అభినందనీయుడు.

సమాజానికి మేలు చేయాలంటే ముందుగా రైతును మేల్కొల పాలి అని గ్రహించిన విజయ కుమార్ ఒక వికలాంగుడు. అతని కుడిచేయి చిన్నప్పుడు విద్యుదాఘాతం తగిలి కుచించుకు పోయింది. అరచేయి పూర్తిగా విచ్చుకోదు. అయినా తన వ్యవసాయ పనులను సునాయాసంగా చేసుకుంటూ ఉంటాడు. ఈ ప్రచారం తెలుగు రాష్ట్రాలను బాగా ప్రాచుర్యం పొందిన తర్వాత కొందరు తాము పండించిన చిరు ధాన్యాలైన 6 రకాల కొర్ర జాతి .... 1. కొర్రలు, 2. అండు కొర్రలు, 3. ఊదలు, 4. బరిగలు, 5. సామలు, 6. ఆరికలు. వీటి మార్కెట్ ఎలా చేసుకోవాలో తెలియటం లేదు అని రైతులు తమ గోడును వెల్లడీస్తే. ఈ విషయాన్ని గమనించిన విజయ కుమార్, వీటన్నిటిని రైతుల నుండి తానే సేకరించే ఏర్పాటు చేయాలి అని ఆలోచిస్తున్న సమయంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసుకుంటున్న తన కుమారుడు 'ఎవరినో అడుక్కోవడం దేనికి, మనమే ఒక చిన్నపాటి మిల్లు ఏర్పాటు చేసుకుందాం' అని ప్రోత్సహించటంతో వారే స్వయంగా ఈ కొర్రలను బియ్యంగా మార్చి, 6 రకాల కొర్ర బియ్యాన్ని ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు, ఇతర రాష్ట్రాల లోని ఆర్గానిక్ ఆహార రైతులు, ఆర్గానిక్ ఆహార ఉత్పత్తులు విక్రయించే షాపుల యజమానులకు నేరుగా పంపుతున్నాడు. ఈ విధంగా కూడా రైతులకు మార్కెటింగ్ చేసుకునే శ్రమను తప్పించటంతో పాటు, మార్కెట్‌ల వల్ల రైతుకు కమీషన్ల భారిన పడకుండా సరియైన విలువ నేరుగా రైతుకు అందేలా చేస్తున్న విజయ కుమార్ కృషి అభినందనీయం. ●

**ఇందుకు సంబంధిచిన పూర్తి సమాచార వివరాలు, సలహాల కోసం కొమ్మూరి విజయ కుమార్ గారిని ఉదయం 5 నుండి 7 గం. మరియు సాయంత్రం 6 నుండి 8 గం.ల సమయంలో 9849648498 నంబర్ కు ఫోన్ చేసి సంప్రదించ గలరు.**

## పల్లెసృజన కార్యాలయంలో ఇన్నోవేషన్ల విస్తృత కేంద్రం



దేశవ్యాప్తంగా పునాదిస్థాయి ఇన్నోవేటర్లు (గ్రామీణ శాస్త్రవేత్తలు) తయారు చేసిన ఇన్నోవేషన్ల ప్రదర్శన 'పల్లెసృజన' కార్యాలయంలో ఏర్పాటు చేయడమైనది. ఈ ప్రదర్శనను పాఠశాల, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, రైతులు సందర్శిస్తున్నారు. రైతులు ఈప్రదర్శనను చూస్తే వారికి అవసరమైన పనిముట్లను గుర్తించి వాటిని లాభకరంగా వినియోగించుకునే అవకాశం లభించటంతో పాటు, దేశీయ జ్ఞానానికి చేయూతను అందించిన వారవుతారు. మీ సమస్యలను పల్లెసృజనతో చర్చించవచ్చు.

**హైదరాబాద్ వచ్చినపుడు 'పల్లెసృజన' కార్యాలయాన్ని తప్పక దర్శించండి.**
**ముందుగా మా కార్యాలయానికి సందేశాన్నిస్తే మీ సందర్శనను అర్థవంతంగా చేస్తాం.**

'పల్లెసృజన' కార్యాలయం చిరునామా :

**77, రోడ్ నెం. 3, వాయుపురి, సైనిక్‌పురి పోస్టు, సికింద్రాబాద్ – 500 094.**
**ఫోన్ : 040–49253096, సెల్ : 96528 01700.**



# జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి
రెడీ టు సేల్' ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## అభివృద్ధి చేయబడ్డ 'జామ' రకం "జి-విలాస్ పసంద్"

**రాంవిలాస్ మౌర్య,** లక్నో, ఉత్తర ప్రదేశ్.

**జాతీయ స్థాయి మొదటి బహుమతి**



69 సం. రాంవిలాస్ మౌర్య తాను నివసించే ప్రాంతంలో పేరొందిన ఆదర్శ రైతు. కేవలం 10వ తరగతి వరకు మాత్రమే చదువుకున్నప్పటికీ ఇతను వ్యవసాయంలో ప్రయోగాలు చేస్తూనే ఉన్నాడు. ఇతడు అభి వృద్ధి చేసిన 'జామ' రకాన్ని రూపొందించాడు. ఇది రైతుకి లాభసాటిగా ఉంటూ అన్ని కాలాలలో లభిస్తుంది. మార్కెట్‌లో కూడా మంచి ధర పలుకుతుంది.

ఈ ప్రక్రియ 1970 ప్రాంతంలో ప్రారంభం అయ్యింది. ఆ కాలంలోనే ఇతడు స్థానికంగా లభించే ఒక జామ రకాన్ని చెట్లకు చాలా కాయలు, పెద్ద కాయలు కాచే దానిని ఎంపిక చేసుకొని, దాని 15 విత్తనాలని తన నర్సరీలో నాటి, ఆ చెట్లని క్రమంగా ప్రతి సంవత్సరం పరిశీలించాడు. 1979 నాటికి ఒక రకం చెట్టుకి చాలా పెద్ద కాయలు కాయటం, అదీ యేడాది పొడవునా కాయటం గమనించాడు. 1980-84 సంవత్సరాల కాలంలో ఆ రకంపై ప్రయోగాలు చేసి ఏడాది పాటు పెద్ద కాయలు కాచే రకాన్ని స్థిర పరిచాడు.

ఇదే 'జి-విలాస్' రకం. గరుకుగా ఉండే చర్మం ఉన్నా, లోపల కండ తెల్లగా ఉండి, మంచి రుచి కలిగి, మార్కెట్‌లో ఎక్కువ ధర పలుకుతుంది. ఈ రకం ప్రత్యేకత ఏమిటంటే ఇవి ఏడాది పొడవునా కాయలు కాయటమే కాక, మంచి ధర పలికి చిన్న సైజు చెట్లుగా ఉంటాయి కాబట్టి ఎకరాకి ఎక్కువ చెట్లు నాటుకోవచ్చు.

ఈ రకం 5 సంవత్సరాల వయసున్న చెట్టు ఏడాదికి 50-60 కిలోల కాయల దిగుబడి వస్తుంది. ప్రతి కాయ సరాసరి 300-400 గ్రాముల బరువు ఉంటుంది.



ఉత్తర ప్రదేశ్ లోని (ఐసిఎఆర్) ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చరల్ రీసర్చ్ వారి అనుబంధ సంస్థ అయిన సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సబ్ ట్రాపికల్ హార్టికల్చర్ వారు జరిపిన పరీక్షలలో ఈ రకం మంచి సైజులో ఉండి, సంవత్సరం పొడవునా కాపు కాస్తాయని ధృవీకరించారు. ప్రతి చెట్టు 60-80 కిలోల కాయలు కాస్తాయని, ఒక్కో కాయ సుమారు 350 గ్రాములు ఉంటుందని నిర్ధారించారు. ఇతర రకాల లాగా కాకుండా అన్ని కాలాలలో సంవత్సరం పొడవునా కాస్తాయి కనుక రైతుకి చాలా లాభకరంగా ఉంటుంది.

రాంవిలాస్ ఈ రకం మొక్కలని ఉత్తర ప్రదేశ్‌లోనే కాక రాజస్థాన్, హర్యాణా, మహారాష్ట్రలతో పాటు దక్షిణ భారత రాష్ట్రాలలో కూడా విక్రయిస్తున్నాడు. ఈ రకం 2021వ సంవత్సరంలోనే పిపివి & ఎఫ్ఆర్ క్రింద కొత్త ఢిల్లీలో రిజిష్టరు చేయబడింది. (ఇది ఆహార పదార్థాల పేటెంట్ లాంటిది)

ఈ రకం జామని నాటిన రైతులు, వినియోగదారులు చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## మోటారు లేని "వరి నాటు పరికరం"

**సదాసిబో మార్ఝి,** కోరాపుట్, ఒడిస్సా.

**జాతీయ స్థాయి ద్వితీయ బహుమతి**



ఒడిస్సా జిల్లాలోని కోరాపుట్‌కు చెందిన 43 సంవత్సరాల సదాసిబో మార్ఝి మెకానిక్, వెల్డింగ్ పనులు చేస్తుంటాడు. 9వ తరగతి వరకు చదువుకున్నాడు. ఇనప గేట్లు,





ఈ పరికరాన్ని చేతితో లాగవలసి వుంటుంది. కనీసం ఇద్దరు మనుష్యులు అవసరం అవుతారు. సునాయాసంగా మెకానికల్ పద్ధతిలో పని చేస్తుంది. దీనిలో మొక్కను ఎంత లోతుకు, ఎంత దూరంలో నాటాలో సర్దుబాటు చేసుకునే సదుపాయం కూడా ఉంది. ఒకేసారి ఆరు వరుసలలో నాటుకోవచ్చు. గంటకు అర ఎకరంపైగానే నాట్లు వేసుకోవచ్చు. ప్రతి మొక్కకు మధ్య 6 అంగుళాల దూరంలో నాటుతుంది. మొత్తం ప్లాంటర్ 91 సెంటీమీటర్లు ఉంటుంది. ఈ పరికరానికి కావలసిన శక్తి లాగుతున్నపుడు చక్రాలు తిరిగి చైన్ స్ప్రాకెట్ (సైకిల్ లో లాగా) పని చేస్తుంది. దీనిని వినియోగించుకోవటానికి ఎకరాకి రూ. 400/- వరకు మాత్రమే ఖర్చు అవుతుంది. అదే మోటారు లేదా ట్రాక్టరు సహాయంతో పనిచేసే యంత్రంతో ఎకరాలకి 4-5 వేల రూపాయల దాకా ఖర్చవుతుంది. ఈ యంత్రం వాడిన వాళ్ళు చాలా బాగుందని కితాబునిచ్చారు.

కిటికీలకి గ్రిళ్ళు చేస్తూ అప్పుడప్పుడూ వ్యవసాయానికి సంబంధించిన పనిముట్లు, ట్రాక్టర్లకి 'కేజ్ వీల్స్' (వరిలో దమ్ము చేసే చక్రాలు) మొదలైనవి చేస్తూ ఉంటాడు. మొదట ఇతరుల దగ్గర పని చేస్తూ బాగా పని నేర్చుకొన్న తరువాత తానే స్వంత వర్క్‌షాప్ ప్రారంభించాడు.

కోరాపుట్ ఆర్థికంగా చాలా వెనుకబడిన ప్రదేశం. అందులో ఎక్కువగా ఆదివాసీ తెగల ప్రజలు నివసిస్తుంటారు. చాలామంది మార్కెట్‌లో ఖరీదైన వ్యవసాయ పనిముట్లు కొనుక్కోలేని పరిస్థితుల్లో ఉంటారు. ఇది గమనించిన సదాసిబో మోటారు అవసరం లేని వరి నాటే పరికరాన్ని రూపొందించాడు. దానికతను చాలా శ్రమపడ్డాడు. అనేకసార్లు చాలా మార్పులు చేర్పులు చేసి చివరికి తాను అనుకొన్నది సాధించాడు.

**ఈ ఇన్నోవేషన్లను కావలసిన వారు సంప్రదించండి:**

**పల్లె వీరరాఘవ రెడ్డి, ఫోన్ : 81257 99904.**

**సుభాష్ చందర్, ఫోన్ : 9652801700**

## 20 సంవత్సరాల 'పల్లెసృజన' పత్రిక భవిష్యత్తు ..... మీ సలహాలు

'పల్లెసృజన' సంస్థను స్థాపించి వచ్చే నవంబరు మాసానికి 20 సంవత్సరాలు పూర్తి అవుతున్నది. ఈ సందర్భంగా పాఠకులకు బాధాతప్త హృదయంతో ఒక విషయాన్ని తెలియజేయాలి అనుకుంటున్నాము. 2006 లో ప్రారంభమైన 'పల్లెసృజన' పత్రిక మొదట త్రైమాసిక పత్రికగా వెలువడి ఆ తర్వాత 2010లో పాఠకుల కోరిక మేరకు 'ద్వైమాసిక' పత్రికగా వెలువరించటం జరిగింది. పత్రిక ప్రారంభమైన నాటినుండి నేటి వరకు పత్రికలో ఎటువంటి వ్యాపార ప్రకటనలు లేకుండా కేవలం చందాదారుల సహకారంతోనే ఈ పత్రికను కాస్త భారమైనా నిరాటంగంగా పత్రికను అందించ గలిగాము, మీ ఆదరణ చూరగొన గలిగాము అని తెలియజేయుటకు సంతోషిస్తున్నాము

కానీ, జనవరి 2026 నుండి పత్రిక ముద్రణను మానేయాలి అనుకుంటున్నాము. అందుకు కారణం ముద్రణా ఖర్చులు పెరగటం, చందాదారు మేము ఆశించినంతగా పెరగక పోవటం, మా పత్రికా సంపాదక వర్గం అందరూ 63-76 సంవత్సరాల వయసు మీరిన వాళ్ళము కావటం చేత ఈ బాధాకరమైన నిర్ణయాన్ని తీసుకోవటం జరిగింది. కాబట్టి జనవరి నుండి 'పల్లెసృజన' పత్రిక ముద్రణ కాదు అని బాధాతప్త హృదయంతో తెలియజేసుకుంటున్నాము. కానీ, పత్రిక మీకు అందటం కొనసాగుతునే ఉంటుంది.

పత్రికను తయారు చేసి కేవలం 'సాఫ్ట్ కాపీ (పిడిఎఫ్) రూపంలో అందించాలన్న ఆలోచన చేస్తున్నాము. అందుకు కూడా కొంత వరకు ఖర్చవుతుంది. కానీ, అందుకు పాఠకులు సహకరిస్తే, సాఫ్ట్ కాపీ చందాదారులుగా చేర గలిగితేనే ఈ ప్రయత్నం కూడా ముందుకు సాగుతుందని విన్నవించుకుంటున్నాము. మేము తీసుకున్న ఈ నిర్ణయం పట్ల మీ అభిప్రాయాలను తెలియజేయ వలసిందిగా కోరుతున్నాము. మీ అమూల్యమైన అభిప్రాయాలను ఈ క్రింది ఫోన్ నంబర్లకు తెలియజేయ గలరు. **- జమ్మలమడక శశిమోహన్, ఎడిటర్**

**బ్రిగేడియర్ పోగుల గణేశం, ఫోన్ 9866001678;**

**పల్లె వీరరాఘవ రెడ్డి, ఫోన్: 8125799904.**

# సెప్టెంబర్ - అక్టోబర్ 2025 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాలు



27-28 ఆగస్టు, 2025 న ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం లోని బిలాస్‌పూర్ జిల్లాలో గల బైకుంత్పూర్ లో స్థానిక కెవికె నిర్వాహకులు మన ఇన్నోవేటర్ మహిపాల్ చారి పవర్ వీడర్ ప్రదర్శన మరియు శిక్షణ కార్యక్రమాన్ని 2 రోజుల పాటు నిర్వహించారు. ఆ కార్యక్రమంలో రైతులకు ఇన్నోవేటర్ మహిపాల్ చారిని పరిచయం చేస్తూ, ఈ పవర్ టిల్లర్ కావాలనుకునే రైతులు అతనితో నేరుగా సంప్రదించి ఏర్పాటు చేసుకోవచ్చని, అందుకు అవసరమైన సహాయ సహకారాలను కెవికె అందిస్తుందని తెలిపారు.



14 అక్టోబర్, 2025న ఢిల్లీలోని 'ఫెర్నాడ్ రికార్డ్' వారి కార్యాలయంలో 'దీపావళి' సందర్భంగా "ఇక్కత్ వస్త్రాల ప్రదర్శన' ఏర్పాటు చేశారు. ఆ ప్రదర్శనలో ఇటీవల "పోచంపల్లి చేనేత మహిళలకు ఏర్పాటు చేసిన ప్రీ లూం శిక్షణా కార్యక్రమం"లో శిక్షణ పొందిన జనగాం జిల్లా, బాణాపురం గ్రామానికి చెందిన "స్రవంతి" తానే స్వయంగా ఒక డిజైన్ తయారు చేసి, మగ్గంపై స్వయంగా నేత నేసిన చీరలను ప్రదర్శించి, సందర్శకులు, నిర్వాహకుల ప్రశంసలను అందుకుంది.




18 అక్టోబర్, 2025న హైదరాబాద్‌లో నిర్వహించిన "టాటా సోషియల్ ఎంటర్‌ప్రైజ్ ఛాలెంజ్" కార్యక్రమంలో మన ఇన్నోవేటర్ అల్లాడి ప్రభాకర్, వారి కుమారులను సత్కరించినప్పటి చిత్రం.



03 సెప్టెంబర్, 2025న హైదరాబాద్ లోని గుర్రంగూడకు చెందిన 'కిడ్జీ' పాఠశాలకు చెందిన 30 మంది విద్యార్థులు, 3 ఉపాధ్యాయులు 'పల్లెసృజన' కార్యాలయాన్ని సందర్శించారు. అక్కడి ఇన్నోవేషన్లను గురించి వారికి వివరంగా తెలియజేయగా, వారంతా ఎంతో అనుభూతితో వాటిని పరిశీలించారు, కార్యక్రమం మొత్తం ఎంతో ఆహ్లాదంగా నిర్వంచబడింది.



24-25 సెప్టెంబర్, 2025 తేదీలలో భువనేశ్వర్‌లో 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్' (ఎన్‌ఐఎఫ్) వారు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మన పల్లెసృజన ఇన్నోవేటర్లు 'చింతకాయల రాంబాబు, శ్రీనివాస్, శివచంద్రప్రసాద్'లు పాల్గొన్నారు.




'తెలంగాణ ఇండస్ట్రియల్ ఎంటర్‌ప్రెన్యూర్' వారు "టిఐఇ50" పేరుతో నిర్వహించిన ఒక కార్యక్రమంలో మన 'పల్లెసృజన' ఇన్నోవేటర్ షణ్ముఖరావు మొదటి 50 మందిలో ఒక ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎంపిక చేసి ఇన్నోవేటర్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న నిర్వాహకులు.





'ట్రై సర్వీసెస్' (3) ఆఫీసర్లకు పల్లెసృజన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లను 7 నవంబర్, 2025న ప్రదర్శించడమైనది. ఈ కార్యక్రమాన్ని 'అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా' వారి ఆధ్వర్యంలో ఈ బృందం పల్లెసృజనను సందర్శించడం జరిగింది.



22 సెప్టెంబర్, 2025న ఆంధ్రప్రదేశ్ 'రాష్ట్రీయ స్వయం సేవక్' (ఆర్‌యస్‌యస్) ప్రతినిధులు బృందం 'పల్లెసృజన' కార్యాలయాన్ని సందర్శించి, అక్కడ ప్రదర్శించిన పునాదిస్థాయి ఇన్నోవేషన్లను పరిశీలించడం జరిగింది.













4-11-2025న విశాఖపట్నంలో 'ఫోర్బ్స్ ఇండియా మరియు లయన్స్ క్లబ్ ఇంటర్ నేషనల్' వారి భాగస్వామ్యంలో జరిగిన 'ఇన్‌క్లూజివ్ హెల్త్‌కేర్ & యాక్సెసబిలిటీ' పురస్కారాల కార్యక్రమంలో మన 'పల్లెసృజన' ఇన్నోవేటర్లు "అల్లాడి ప్రభాకర్, గొర్రె అశోక్" లను విజేతలుగా ప్రకటించింది. కేంద్ర భారీ పరిశ్రమల సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ గారి చేతుల మీదుగా పురస్కారాలు అందించడమైనది.



# యువత అవగాహనకై ప్రకృతిలో లభించే చెట్ల పేర్లు

## సంస్కృతం మరియు తెలుగు భాషల్లో

**సేకరణ : పర్యావరణ వేత్త "కొమెర అంకారావు (జాజి)"**

మారుతున్న కాలమాన పరిస్థితుల దృష్ట్యా ప్రస్తుతం నేటి యువతకు చాలా వరకు చెట్ల పేర్లు తెలియటం లేదు. వాటిని పిల్లలకు తెలియజేసే వారు కూడా కరువయ్యారు. ఈ విషయం అవగాహన చేసుకున్న పర్యావరణవేత్త "కొమెర అంకారావు (జాజి)" పల్లెసృజనకు తాను సంస్కతం మరియు తెలుగు లో సేకరించిన చెట్ల పేర్లను తెలియజేస్తున్నాడు. వీటిని మీ చిన్నారులచేత తప్పక చదివించండి. వీలైతే మీ పరిథిలో వారు అడిగిన చెట్లను చూపించండి. ఇలా చేయటం వల్ల ప్రకృతి పట్ల చిన్నారుల్లో అవగాహన పెరుగుతుంది. భవిష్యత్తులో వారికి చెట్లపైన అవగాహన పెరిగి, పర్యావరణం రక్షించడానికి దోహద పడుతుంది. **చెట్ల పేర్లు (గత సంచిక తరువాయి)** **- ఎడిటర్**

| వ.సం. | సంస్కృతం | - | తెలుగు |
|---|---|---|---|
| 855 | సాతలా | - | సంబరేణు |
| 856 | సారీ | - | సాంబ్రాణి చెట్టు |
| 857 | సాల | - | ఏపి చెట్ట |
| 858 | సాలాక్షా | - | పిరంగి సాంబ్రాణి |
| 859 | సింధు వార | - | వావిలి చెట్టు |
| 860 | సిఖలు | - | మొక్కజొన్న పొత్తులు |
| 861 | సితపాటలా | - | తెల్ల కలిగొట్టు |
| 862 | సితార్జక | - | తలసి |
| 863 | సుకంద | - | నీరుల్లి పాయ |
| 864 | సుకాండ | - | రెల్లుగడ్డి |
| 865 | సుకుమార | - | సంపెంగ చెట్టు |
| 866 | సుగంధ మరీచ | - | చలువ మిరియాలు |
| 867 | సుగంధ | - | పాల సుగంధ |
| 868 | సుదర్శన | - | విషమంగలపు చెట్టు |
| 869 | సుదీర్ఘ | - | పొట్లచెట్టు |
| 870 | సుప్రజ | - | పద్మకాష్టము |
| 871 | సుప్రసార | - | గొంతిమ గోరుతీగ |
| 872 | సుముఖ | - | అడవి గగ్గెర |
| 873 | సురంభిగంధ | - | జాజి పువ్వులు |
| 874 | చంద్రదారు | - | దేవదారు చెట్టు |
| 875 | సురభి పత్ర | - | నేరేడు చెట్టు |
| 876 | సుర మృత్తిక | - | తుపరిమన్ను |
| 877 | సువర్చల | - | పొద్దు తిరుగుడు చెట్టు |
| 878 | సువర్ణకదళీ | - | బంగారు అరటి చెట్టు |
| 871 | సుప్ర సార | - | గొంతిమ గోరు తీగ |

| వ.సం. | సంస్కృతం | - | తెలుగు |
|---|---|---|---|
| 872 | సుముఖ | - | అడవి గగ్గెర |
| 873 | సురంభి గంధ | - | జాజి పువ్వులు |
| 874 | చంద్రదారు | - | దేవదారు చెట్టు |
| 875 | సురభి పత్ర | - | నేరేడు చెట్టు |
| 876 | సుర మృత్తిక | - | తుపర్నిమన్ను |
| 877 | సువర్చల | - | ప్రొద్దు తిరుగుడు చెట్టు |
| 878 | సువర్ణ కదళీ | - | బంగారు అరటి చెట్టు |
| 879 | సువి రేచన | - | ఆకు జెముడు చెట్టు |
| 880 | సూత్రపుష్ప | - | పైడిపత్తి చెట్టు |
| 881 | సూరణ | - | అడవి కంద |
| 882 | సూర్య భరక్త | - | ప్రొద్దు తిరుగుడు చెట్టు |
| 883 | సూక్ష్మ మూలా | - | బుడ్డకాకర చెట్టు |
| 884 | సేపాలికా | - | నల్ల వావిలి |
| 885 | సైరేయక | - | ములు గోరింట తీగ |
| 886 | సోమరాజి | - | కారు గచ్చ చెట్టు |
| 887 | సోమలతా | - | సోమలత |
| 888 | సోమవృక్ష | - | తెల్ల చంద్ర చెట్టు |
| 889 | శతపుష్ప | - | పిన్న సదాప |
| 890 | సౌలి | - | అడవి పసుపు |
| 891 | సౌమ్యగంధ | - | గులాబీ పువ్వు |
| 892 | స్థలపద్మిని | - | మొట్ట తామర |
| 893 | స్థుల కంద | - | పెండలము |
| 894 | స్పర్శ లజ్జ | - | మునుగు తామర |
| 895 | స్థిర గంధ | - | మొగలి పువ్వు |
| 896 | స్థుల చూత | - | జీడి మామిడి చెట్టు |
| 897 | స్థుల దర్భ | - | ముంజ దర్భ |

| వ.సం. | సంస్కృతం | – | తెలుగు |
|---|---|---|---|
| 898 | స్థల శింభో | – | చమ్మకాయ కూర |
| 899 | స్థల శృంగాట | – | పెద్ద పల్లేరు |
| 900 | స్థాణేయక | – | మాచిపత్రి |
| 901 | స్నిగ్ధ బీజ | – | ఇనుపగోలు గింజలు |
| 902 | స్నుహి | – | చెముడు చెట్టు |
| 903 | స్నేఫల | – | నువ్వు చెట్టు |
| 904 | స్నేవృక్ష | – | భద్ర దేవదారు |
| 905 | స్ఫుక్క | – | పిక్కచెట్టు |
| 906 | స్వందస్ట | – | పెద్ద పల్లేర |
| 907 | స్వనాడిక | – | అటుక మామిడి |
| 908 | స్వర్ణ జీవంతిక | – | స్వర్ణ జీవంతి |
| 909 | స్వర్ణ దుగ్ధ | – | బులురక్కిస చెట్టు |
| 910 | స్వర్ణ పత్రి | – | నేల తంగేడు చెట్టు |
| 911 | స్వర్ణ పుష్ప | – | రేల చెట్టు |
| 912 | స్వర్ణమాక్షిక | – | హేమాక్షిరం |
| 913 | స్వర్ణముఖి | – | సునాముఖి |
| 914 | స్వర్ణలత | – | పిన్న మావేరు |
| 915 | స్వర్ణక్షిరి | – | బులురక్కిస చెట్టు |
| 916 | స్వర్ణికా | – | సజ్జకారము |
| 917 | స్వల్ప కందం | – | సమ్మదుంప |
| 918 | స్వాదు వృక్ష | – | కాంద్రేగు చెట్టు |
| 919 | శ్వేత తులసి | – | తులసి |
| 920 | హంస పాది | – | హంసపాది |
| 921 | హపుషా | – | విత్తు బోడతరము |
| 922 | హయమారక | – | వాడ గన్నేరు |
| 923 | హరి చందన | – | పీత చందనము |
| 924 | హరితాళ | – | హరిదళము |
| 925 | హరిద్రా | – | పసుపు |
| 926 | హరిమంద | – | పచ్చ పెసలు |
| 927 | హరీతకీ | – | కరక్కాయ |
| 928 | హరిత మంజరి | – | మూర్కొండ చెట్టు |
| 929 | హరి వాలుక | – | కూతురు బుడమ |
| 930 | హరేణుక | – | రేణుకలు |
| 931 | హాలిప్రియ | – | కడిమి చెట్టు |
| 932 | హస్తికర్ణి | – | ఏనుగ చెవి చేమ చెట్టు |
| 933 | హస్తిశుడి | – | తేలుమణి చెట్టు |
| 934 | హింగు పత్రి | – | హింగుపత్రము |
| 935 | హిజ్జల | – | కొబాడీకాయ |
| 936 | హిలమొచికా | – | చిలుక కూర చెట్టు |
| 937 | హేమ దుగ్ధ | – | మేడి చెట్టు |
| 938 | హేమ పుష్ప | – | అశోక వృక్షము |
| 939 | హేప పుష్ప | – | నేల తంగేడు చెట్టు |
| 940 | హేమ పుష్పకా | – | బీరకాయ |
| 941 | హేమవల్లీ | – | స్వర్ణ జీవంతి |
| 942 | హేమ సాగర | – | బీజ పత్రము చెట్టు |
| 943 | హ్రీభేర | – | కురువేరు |
| 944 | క్షార శ్రేష్ఠ | – | మొక్కపు చెట్టు |
| 945 | క్షీర కాకొళి | – | క్షీర కాకొళి |
| 946 | క్షీరతుంబీ | – | పాల అనబకాయ |
| 947 | క్షీరవృక్ష | – | మేడి చెట్టు |
| 948 | క్షీర వృక్ష | – | జిల్లేడు చెట్టు |
| 949 | క్షీరావి | – | పిన్నపాల చెట్టు |
| 950 | క్షీరణి | – | పిన్నపాల చెట్టు |
| 951 | క్షీరీ | – | పాలపండు |
| 952 | క్షుద్ర ఇంద్ర వారుణీ | – | పిన్న పాపర |
| 953 | క్షుద్రామా | – | పోకమామిడి కాయ |

**నల్లమల మరియు ఇతర అడవుల్లోను, ఎత్తయిన కొండలపైన పెరిగే అందమైన గడ్డి జాతులు మరియు కొన్ని వృక్షాల పేర్లు.**

| | | |
|---|---|---|
| అడవి కొర్రాయి గడ్డి | దూడ గడ్డి | నల్ల గడ్డి |
| కంతరి గడ్డి | ఎర్ర ఏనుగు గడ్డి | నాగు గడ్డి |
| యయరాయి గడ్డి | కొండ శామగడ్డి | ఏరు గడ్డి |
| ఈడే గడ్డి | పిట్ట కాలుగడ్డి | కుంట గడ్డి |
| కాసిరి గడ్డి | దూబ గడ్డి | తీగ గడ్డి |
| దుబ్బ కాసిరి గడ్డి | ముక్కు పుడక గడ్డి | దుంప గడ్డి |
| యర్రగొాయి గడ్డి | నల్లి గడ్డి | బురద గడ్డి |
| గెరిక గడ్డి | కుందేలు గడ్డి | గట్టు గడ్డి |
| కాచి గడ్డి | పరిక గడ్డి | చామంతి గడ్డి |
| బొద గడ్డి | కట్లగడ్డి | వామి గడ్డి |
| కాస్య గడ్డి | మిన్న గడ్డి | దూబ గడ్డి |
| కోడిజుట్టు గడ్డి | మీనుము గడ్డి | ఊబ గడ్డి |
| కొండ అంత్రిక గడ్డి | సాంబ్రాణి గడ్డి | మెలిక గడ్డి |
| కుల్ప గడ్డి | మబ్బు గడ్డి | పెన గడ్డి |
| కుందర గడ్డి | పిట్ట గడ్డి | వాన గడ్డి |
| నక్కతోక గడ్డి | అడవి గడ్డి | మంచు గడ్డి |
| అరికలు గడ్డి | సేపు గడ్డి | తుంపర గడ్డి |
| ఊత గడ్డి | ఉత్తరేణి గడ్డి | మొక్క గడ్డి |
| కాప్రాడ గడ్డి | పరిమి గడ్డి | ఆకు గడ్డి |
| పెద్ద పాలగడ్డిబొగ్రే గడ్డి | పొరక గడ్డి | సప్ప గడ్డి |
| గుర్ర బోటెకీలు | నెల్లి గడ్డి | దంపుడు గడ్డి |
| పిల్లి పిసర గడ్డి | నెమలి గడ్డి | పుల్ల గడ్డి |
| రెల్లు గడ్డి | నీడ గడ్డి | బండ గడ్డి |
| ఊద గడ్డి | కొస గడ్డి | బాతురు గడ్డి |
| ఉదర గడ్డి | జనప గడ్డి | అరికె గడ్డి |
| వట్టివేరు గడ్డి | మబ్బు గడ్డి | మిన్న గడ్డి |
| సిగిరింత గడ్డి | పసురు గడ్డి | నలికిరి గడ్డి |
| ఏడుముళ్ళ గడ్డి | నీళ్ళ గడ్డి | పురుగు గడ్డి |
| నాంఁద్ర గడ్డి | బురక గడ్డి | పాపి గడ్డి |
| కాశ గడ్డి | వంగ గడ్డి | పచ్చ గడ్డి |
| సిరిగింత గడ్డి | తుర్రు గడ్డి | సిగ్గు గడ్డి |
| చేదుబొద గడ్డి | పచ్చారు గడ్డి | ముతడ గడ్డి |
| తుంగ గడ్డి | అగ్గి గడ్డి | పారి గడ్డి |
| పీచు గడ్డి | మురికి గడ్డి | పాతాళ గడ్డి |
| బుర్రగడ్డి | జాతి గడ్డి | నల్లమాయి గడ్డి |
| ఈత గడ్డి | నిమ్మ గడ్డి | బావి గడ్డి |

**(సమాప్తం)**

**(మరిన్ని వివరాలకు, తప్పు ఒప్పులకు కొమెర అంటారావు (జాజి) గారిని సంప్రదించండి**
**ఫోన్ : 9908411700**




# డా. ఎపిజె అబ్దుల్ కలాం 'చిన్న పిల్లల సృజనాత్మక మరియు ఇన్నోవేషన్ పురస్కారాలు

- 'హనీబీ' పత్రిక సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

డా. ఎపిజె అబ్దుల్ కలామ్ గారి పేరిట ప్రతి సంవత్సరం 12వ తరగతి పిల్లల వరకు మరియు ఏమీ చదువుకోకపోయినా, చదువు ఆపేసిన 19 సంవత్సరాల పిల్లల నుండి వారి సృజనాత్మకత మరియు ఇన్నోవేషన్‌లకై దరఖాస్తులు స్వీకరించ బడతాయి. ఈ పురస్కారాలు చిన్న పిల్లలలో ఇతరుల కష్టాల గురించి సంవేదన పడటం, స్థానిక ప్రజల సమస్యలకి పరిష్కారాలు కనుగొనటం, తద్వారా సామాజిక అవసరాలను తీర్చటం దృష్టిలో పెట్టుకొని నిర్వహించ బడతాయి.

ఈ పోటీ కేవలం ఉపన్యాసాలు వినటం కొరకు మాత్రమే కాదు, చిన్న పిల్లలకి చాలా మంచి ఆలోచనలు వస్తాయి అన్న తత్వంపై ఆధారపడి ఉంది. ఇటువంటి చురుకైన ఆలోచనలు చేసే పిల్లలను గుర్తించి సమాజానికి పనికి వచ్చే వారి ఆలోచనలను సేకరించి, వారికి తగిన గుర్తింపు, పురస్కారాలు అందజెయ్యటానికి 'గ్యాన్, శ్రిష్టి, హెచ్‌బిపి ఎల్లప్పుడూ ప్రయత్నిస్తునే ఉంటుంది. 2023వ సంవత్సరానికి గాను "ఇగ్నైట్" పేరిట జరిగిన పోటీలలో గెలుపొందిన చిన్న పిల్లల ఆలోచనలు, ఆవిష్కారాల వివరాలలో కొన్ని మీ ముందుంచుతున్నాము.

-ఎడిటర్

## మెదడు పరిస్థితిని ముందుగానే కనుగొనటం:

**సింధూర రాజు,** 10వ తరగతి, న్యూ హారిజన్స్ పబ్లిక్ స్కూల్, ఇందిరా నగర్, బెంగుళూరు, కర్నాటక.



ఈ ప్రాజెక్టులో సాధారణ ఎంఆర్ఐ వివరాలను ఒక ప్రత్యేక మిషన్ లర్నింగ్ పద్ధతి ద్వారా ఎఎస్ఎల్/ ఎంఆర్ఐ లతో అనుసంధాన పరచి, తలలోనిక్త ప్రసరణాన్ని గమనించే పని ద్వారా మెదడు ఏ పరిస్థితుల్లో ఉందో గమనించే ప్రక్రియ. మెదడు ఏ పరిస్థితిలో ఉందో ముందుగానే తెలుసుకోవటం వలన మెదడుకి – నరాలకి సంబంధించిన అల్జీమర్స్ లాంటి జబ్బులను త్వరగా కనుగొని నివారణ చర్యలు తీసుకోవచ్చు.

ఎఎస్ఎల్/ ఎంఆర్ఐ పరీక్షల వివరాలను మెదడును చదివే ఆధునిక పద్ధతులతో అనుసంధానం చెయ్యటం వలన ఖచ్చితంగా మెదడు ఏ స్థితిలో ఉందో తెలుసుకొన గలుగుతాము. ఈ ఆధునిక ప్రక్రియ వలన నరాలకి సంబంధించిన, మెదడుకి సంబంధించిన రోగాలు వచ్చే అవకాశాలను ముందుగానే పసిగట్టి, తగ్గే నివారణ చర్యలను తీసుకోవచ్చు. కేవలం 10వ తరగతి చదివిన చిన్న పిల్ల ఈ ఆధునిక పద్ధతిని గురించి ఆలోచించటం చాలా ఆశ్చర్యగొలిపే విషయం.






## ఆరోగ్య రక్షణ - సోల్డరింగ్ చేసేటపుడు వచ్చే విషవాయువుల నుతొలగించే పద్ధతి :



**అక్షర గుప్తా,** 9వ తరగతి, ఎస్ఎంఎస్ దత్త మెమోరియల్ నొసగె పబ్లిక్ స్కూల్, ఖతియా, ఉత్తరాఖండ్.

ఎలక్ట్రిక్ లేదా ఎలక్ట్రానిక్ పనుల, రిపేర్లు చేసేటపుడు సోల్డరింగ్ చెయ్యటం చాలా ముఖ్యమైన ప్రక్రియ. కానీ ఈ సోల్డరింగ్ చేసేటపుడు కొన్ని విష వాయువులు వస్తాయి. వాటివలన పని చేసే వ్యక్తి ఆరోగ్యం దెబ్బతినే పరిస్థితి వస్తుంది. దీన్ని నివారించటానికి మన వంటింట్లో వాడే ఎగ్జాస్ట్ పద్ధతిలో మీదనే ఒ కగొట్టం, ఎగ్జాస్ట్ ఫ్యాన్ సహాయంతో ఈ విష వాయువులని దూరంగా పీల్చివేసే పద్ధతి ఉపయోగిస్తే, ఈ సోల్డరింగ్ చేసే వ్యక్తి, ఎలక్ట్రిషియన్ ఆరోగ్యాన్ని కాపాడదగిన వాళ్ళము అవుతాము.









## ప్రకృతిలో సమతులనం - తెల్లతోక జింక (వర్జీనియా జింక) లను ఖచ్చితంగా లెక్కగట్టే మోడల్:



**దక్షేష్ సర్ధ,** 9వ తరగతి, అమితి ఇంటర్నేషనల్ స్కూల్, గురుగ్రామ్, హర్యాణా.

అడవుల్లో జంతు పరిరక్షణలో వాటిని లెక్కించటం అతి ముఖ్యమైన భాగం. వాటిని లెక్కించటానికి రకరకాల పద్ధతులు వాడుతుంటారు. హర్యాణా లాంటి కొండ ప్రాంతపు అడవులలో కనిపించే తెల్లతోక జింకలను రక్షించటానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. వారికి సహాయకారిగా ఉండటానికి ఎల్లప్పుడు అధునాతమైన ట్రాకింగ్ మరియు కాపాడ వలసిన పద్ధతులు ఉపయోగించి వాటి జనాభాను లెక్కలతో గణితశాస్త్ర మోడల్‌ను ఆవిష్కరించాడు దక్షేష్. దీని వలన జంతువులని ప్రత్యేకించి తెల్లతోక జింకల జనాభాను లెక్కించి వారి పరిశోధనకి ఉపయోగపడేలా చేశాడు.

## సముద్ర తీర రక్షణ - సముద్ర తీరాన్ని శుభ్రపరిచే పరికరం :



**శీతల్ అనిల్ మండలాకర్,** 6వ తరగతి, ఎన్ఎంఎంసి స్కూలు నం. 44, నవీ ముంబయ్, మహారాష్ట్ర.

జనం ఎక్కడ పోగయితే అక్కడ చెత్త పేరుకొనిపోవటం సహజమైపోయింది. వాటికి మన సముద్ర తీరాలు అతీతం ఏమీ కాదు. 'శీతల్' ఊహించిన పరికరం బీచ్‌లలో పోగయ్యే చెత్తను చేతులతో ఒక్కటొక్కటిగా ఏరే పరికరం. చేతిలో తాకవలసిన అవసరం లేకుండా తీసివేసే పద్ధతి.









ఈ పరికరంలో ఒక చక్రాల బండీ, ఒక వల ఉంటాయి. ఈ వల బీచ్‌లోని ఇసకని వడకట్టి కేవలం చెత్తని మాత్రమే సేకరిస్తుంది.

చేతితో కానీ, మోటార్‌తో కానీ నడిచే ఈ బండికీ ముందు భాగంలో తిరిగే ముళ్ళు లాంటివి అమర్చి ఉంటుంది. బండి ముందుకి సాగినప్పుడు ఈ ముళ్ళు ఇసుకను త్రవ్వి పాతుకుని ఉన్న చెత్తను కూడా పైకి తీస్తుంది. ఇసుక జాలీలో నుంచి క్రిందకి జారిపోయి, కేవలం చెత్త, ప్లాస్టిక్ వస్తువులు మాత్రమే మిగులుతాయి. ఈ పరికరం సహాయంతో బీచ్‌లలో పేరుకొని పోయిన చెత్తను త్వరగా, సునాయాసంగా తీసివేసే సదుపాయం కలుగుతుంది.

## మోటార్ సైకిల్ స్టాండ్‌కి తాళం :

**అలగు లక్ష్మి**, 9వ తరగతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తలైపురం, తమిళనాడు.



చిన్న పరికరం మోటార్ సైకిల్ స్టాండ్‌ను వెనక్కి తీస్తే కానీ బండి స్టార్ట్ చెయ్యటం సాధ్యం కాకుండా చేస్తుంది.

ఇవి ఎక్కు ఖర్చు కాని చిన్న హుక్కును స్టాండుకి బిగించటం ద్వారా సాధించవచ్చు. దానివలన బండి నడిపే వ్యక్తి మోటార్ సైకిల్ స్టాండ్‌ను వెనక్కి తోస్తే కానీ బండి స్టార్ట్ చెయ్యడం సాధ్యం కాదు. ఈ చిన్న మెకానికల్ పరికరం ఎవరైనా తయారు చేయించుకోవచ్చు.

(ఇటువంటి ఆలోచనలు ఇంతకు ముందు చాలా ఉన్నా, ఇంత సులభంగా పనిచేసే పద్ధతి ఇంతకుముందు లేదు. **- ఎడిటర్**)

## అడవి మార్గంలో హానికర జంతువులను కనుగొనే పద్ధతి :

**భూపేష్ మంజారే**, 10వ తరగతి, స్వామి ఆత్మానంద్ హిందీ/ ఇంగ్లీష్ స్కూలు, బిలాస్‌పూర్, ఛత్తీస్‌ఘర్.



అడవి మార్గంలో ప్రయాణించేటప్పుడు తరచూ హానికర జంతువులు, పురుగులు, పాములు వంటివి వనమార్గంలోకి రావటం వలన ప్రమాదాలు జరగటం కూడా సహజంగానే జరుగుతుంటుంది. అటువంటి ప్రాంతాల్లో నివసించే వారికి ఇది తరచూ అనుభవంలోకి వస్తుంటుంది.

అటువంటి పరిస్థితులలో మొబైల్ ఫోన్‌ల ఆధారిత సెన్సార్ పద్ధతి ఏర్పాటు చేస్తే చుట్టు ప్రక్కల హానికర జంతువులుంటే ముందుగానే సూచన ద్వారా తెలుసుకోవచ్చు.

ఈ సెన్సారు ఆధునిక అల్గరిథమ్స్ ద్వారా ఒక స్మార్ట్‌ఫోన్ కు అనుసంధానం చేస్తే, ప్రమాదకర జంతువుల ఆనవాళ్ళు, ఛాయలు, కదలికలను ముందుగానే కనిపెట్టి రాబోయే ప్రమాదాన్ని నివారించవచ్చు. చుట్టు ప్రక్కల దగ్గరలో ఏవైనా ప్రామాదాలు పొంచి ఉన్నప్పుడు సెన్సార్ సిస్టమ్ దృశ్యం ద్వారా, మాటల ద్వారా, స్పర్శ ద్వారా వినియోగదారుడికి తెలియ జేస్తుంది. పైగా ఎంత దూరంలో ప్రమాదం పొంచి ఉందో కూడా తెలియజేస్తుంది. దీని ఆధారంగా ఆ వ్యక్తి నివారణ చర్యలు కానీ, వేరే మార్గాన్ని ఎంచుకోవటం కానీ చేసుకొని ప్రమాదాల నుంచి తప్పించుకోవచ్చు.

# నీతి ఆయోగ్ చే గుర్తింపు పొందిన 'పల్లెసృజన ఇన్నోవేటర్లు'




- వీరరాఘవ రెడ్డి

మన 'పల్లెసృజన' ద్వారా వెలుగులోకి వచ్చిన కాకినాడకు చెందిన 'సంపన శ్రీనివాస్' మరియు చిలకలూరిపేటకు చెందిన 'పఠాన్ సైదా'లను కె.ఎల్. యూనివర్శిటీ, విజయవాడ వారు గుర్తించడం జరిగింది. వీరిలో శ్రీనివాస్ 'శక్తి అవసరం లేని పంపు' ద్వారా కేవలం ఒక్కసారి పెట్టుబడి పెట్టి ఏర్పాటు చేసుకుంటే చాలు ఎటువంటి ఖర్చు లేకుండా నీరు తోడుకోవచ్చు' అనే ఇన్నోవేషన్ రూపొందించాడు. ఇక పఠాన్ సైదా 'గాలి ఎటువేపు నుంచి వీచినా, ఎంత సన్నటి గాలికైనా సరే తిరిగేలా గాలిమర (విండ్‌మిల్) రూపొందించాడు. ఈ విండ్‌మిల్‌తో కూడా ఒక్కసారి పెట్టుబడి పెట్టి ఏర్పాటు చేసుకుంటే చాలు, ఎటువంటి నిర్వహణా ఖర్చులు లేకుండా నీటిని తోడుకోవచ్చు' అనే ఇన్నోవేషన్ ను రూపకల్పన చేశాడు.

వీరి ప్రతిభను గుర్తించిన కె.ఎల్. యూనివర్శిటీ వారు శ్రీనివాస్‌కు రూ. 5 లక్షలు, పఠాన్ సైదాకు రూ. 1.5 లక్షల ప్రోత్సాహకాన్ని ఇచ్చి, వారి ఇనోవేషన్‌లను ఇంకా అవసరమైన అభివృద్ధి చేయటానికి తోడ్పడ్డారు. అంతే కాకుండా వీరి ప్రతిభను కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన 'నీతి ఆయోగ్'కు సిఫారసు చేసి, వారే స్వయంగా 'నీతి ఆయోగ్' సమావేశంలో పాల్గొనేలా చేశారు.

కెఎల్ యూనివర్శిటీలో వీరిద్దరి వీడియోలను, వారి ఇన్నోవేషన్‌లను గురించి తెలుసుకున్న ప్రతినిధులు శ్రీనివాస్ గ్రామానికి వెళ్ళి అతను ఏర్పాటు చేసిన పంపును స్వయంగా పరిశీలించారు. ఎంత ఎత్తునుంచి నీరు పారితే ఇలాంటి పంపు ఏర్పాటు చెయ్యవచ్చు, తోడిన నీటిన ఎంత ఎత్తు వరకు తోడవచ్చు లాంటి పూర్తి వివరాలను సేకరించి నీతి ఆయోగ్‌కు ఒక నివేదిక సమర్పించారు. ఆ నివేదికను పరిశీలించిన నీతి ఆయోగ్ 'అరిస్తిక్ తివారి' అనే ప్రతినిధి కెఎల్ యూనివర్శిటీకి వచ్చింది. వారితోనే మన ఇన్నోవేటర్లకు ప్రోత్సాహక చెక్కును అందజేశారు కెఎల్ యూనివర్శిటీ వారు. ఆ తర్వాత వీరిద్దరినీ ఢిల్లీలోని నీతి ఆయోగ్‌కు రమ్మని ఆహ్వానించి, వీరిని విమానంలో ఢిల్లీకి తీసుకు వెళ్ళారు.

అక్కడ దేశంలోని మరి కొందరు ఇన్నోవేటర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో నీతి ఆయోగ్ వారు ఉపన్యసిస్తూ.... "మన దేశంలో








శ్రీనివాస్ ఏర్పాటు చేసిన 'శక్తి అవసరం లేని పంపు' 4 అంగుళాల పైపుతో నీటిని తోడుతోంది.

కొంతవరకు చదువుకున్న సృజనాత్మక కలిగిన వారు చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అలాగే పెద్ద పెద్ద చదువులు చదివిని ఇన్నోవేటర్లు విదేశాలకు వెళ్ళి స్థిరపడుతున్నారు. కానీ దేశానికి చాలా ఇన్నోవేషన్లు అవసరం, అలాగే ఇన్నోవేషన్లు చేసేందుకు గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్లు వారి పరిధిలో అవసరమైన ఇన్నోవేషన్లను తయారు చేస్తున్నారు. కానీ, అవి అనుకున్నంతగా వెలుగులోకి రావటం లేదు. అందుకు కారణం భాష తెలియక పోవటం ప్రధానమైన కారణం అనుకుంటున్నాము. మీ ద్వారా అసలు సమస్య ఎక్కడ ఉత్పన్నమౌతుంది తెలుసుకోవాలి" అని ఇన్నోవేటర్ల అభిప్రాయాలు అడిగారు.

ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీనివాస్ నిజంగానే భాషా పరిజ్ఞానం లేని కారణంగా మాట్లాడలేక పోయాడు. కానీ మన ఇన్నోవేటర్ 'పఠాన్ సైదా' హిందీ తెలుగు మేళవింపుతో మాట్లాడుతూ "మీరు అన్నట్లు భాషా పరిజ్ఞానం లేకపోవటం కేవలం ఒక చిన్న లోటు మాత్రమే. మాట్లాడటానికి భాష వుంటుంది కానీ, పనికి భాష ఉండదు కదా. కాబట్టి మాలాంటి గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్లను గుర్తించేందుకు ప్రతి రాష్ట్రంలో ఒక కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలి. ఆ రాష్ట్రంలో మా లాంటి వాళ్ళను వెలుగులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్న "పల్లెసృజన" లాంటి సంస్థల సహకారంతో ఇటువంటి ఇన్నోవేషన్లను నీతి ఆయోగ్ వెలుగు లోకి తెచ్చినట్లయితే భారత దేశం కూడా ఎంతో అభివృద్ధి చెందటానికి ఎక్కువ సమయం పట్టదు" అని తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.



అసలు గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్లు తాము ఇన్నోవేషన్లను తయారు చేస్తున్నారు. కానీ వారు మన (నీతి ఆయోగ్) వరకు, మన భాషలో చెప్పాలంటే 'గల్లీనుంచి ఢిల్లీ వరకు చేరుకోవటానికి పడుతున్న ఇబ్బంది ఏమిటి?' అని గుర్తించి, ఆ ఇబ్బందిని తొలగించే ఏర్పాటు చేస్తామని, అందుకు అవసరమైన వారందరి సహకారం తీసుకుంటా మన్నారు. అలాగే వీరికి అవసరమైన చోటల్లా 'ఇంక్యుబేషన్ సెంటర్లు' ఏర్పాటు చేసే విషయం కూడా పరిశీలించాలని తీర్మానించారు.

పఠాన్ సైదా మాట్లాడుతూ, "మాలాంటి గ్రాస్‌రూట్ ఇన్నోవేటర్లు ఎంతోమందిని 'పల్లెసృజన' అనే సంస్థ తెలుగు రాష్ట్రాల్లో వెలుగులోకి తెచ్చిందని, కానీ, ఇంకా ఎన్నో వేషన్లు ఆర్థిక వనరుల లేమి దృష్ట్యా ఆలోచన పరిధిలోనే ఆగిపోయాయని. ఇటువంటి వారికి తగిన ఆర్థిక సహాయం అందించ గలిగితే ఇంకా ఎన్నో గొప్ప గొప్ప ఇన్నోవేషనుల వెలుగులోకి వస్తాయి" అన్నారు.

శ్రీనివాస్ మాట్లాడుతూ "మాలాంటి వారు గల్లీ నుంచి ఢిల్లీకి చేరుకోవడంలో భాష కొంత వరకు ఇబ్బంది కలిగిస్తున్న మాటా వాస్తవే అని, కానీ పనికి భాష ఉండదు. ఏ రాష్ట్రంలోనైనా మేము చేసే పని ఇదే, కాకపోతే మాకు అవసరమైన వాటిని వారు అర్థం చేసుకునేలా చెప్పుకో గలమని, అలాగే మా ఇన్నోవేషన్లను పేటెంటు హక్కులు కల్పించే ఏర్పాటు కూడా చేయించే ఏర్పాటు చూడమని" అభ్యర్థించాడు. ●

**ఇన్నోవేటర్లు శ్రీనివాస్, ఫోన్ : 7989599512**

**పఠాన్ సైదా, ఫోన్ : 9347887636**



# పల్లె జ్ఞానం

- 'హనీబీ' ఆంగ్ల పత్రిక సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

30202

**గొర్రెలు, మేకలకి ప్రకృతి వైద్యం:**

37 సంవత్సరాల కతిరేశన్ (మేలస్థానం గ్రామం, పుదుకుట్టై జిల్లా, తమిళనాడు) తన జీవనోపాధిగా గొర్రెలని పెంచుతుంటాడు. ఈ క్రమంలోనే అతను గొర్రెలు, మేకలకి సంబంధించిన అనేక రోగాలకి ప్రకృతి సిద్ధమైన మూలికా వైద్య చిట్కాలు, స్థానిక గితారీ జాతి వారి వద్దనుండి, తన తండ్రి వద్దనుండి నేర్చుకొని తన స్వంత గొర్రెలు, మేకలకే కాక, ఆ ప్రాంతంలోని అనేక మందికి చెందిన జీవాలకి వైద్యం చేస్తున్నాడు.


**విరోచనాలు (గొర్రెలు, మేకలకి):**

అ) రైతులు ఎంతో భయంతో చూసే కుస్కుటా తీగ, లేదా బంగారు తీగగా పిలిచే పరాన్న జీవి తీగ (దీని నివారణకి తీగల చెట్టుతో తప్ప వేరా మార్గం లేదని చెపుతారు)ని ముద్దగా నూరి వ్యాధి సోకిన జీవాలకి తినిపిస్తే మంచి గుణం కనిపిస్తుందట.

ఆ) చల్లని మజ్జిగలో పసుపు కలిపి దాహం తీర్చటానికని గొర్రెలకి మేకలకి తాపిస్తే, విరోచనాలు అరికడతాయంటాడితను.

ఇ) పచ్చి కొబ్బరి బోండంలో ఉండే పువ్వు, మొగ్గని మెత్తగా నూరి, ఒక గ్లాసు నీటిలో కలిపి జీవికి విరోచనాలు తగ్గేవరకు తాగించాలని చెపుతున్నాడీయన.





30205

**విరిగిన పశువుల ఎముకలకు మూలికా వైద్యం:**

తమిళనాడులో ఒక మారుమూల పల్లెలో 68 సంవత్సరాల 'నాకూరన్' కి 5 ఎకరాల భూమి ఉంది. జీవనోపాధి కోసం అతను గొర్రెలను, పాడి ఆవులని పెంచుతుంటాడు. ఈయన తనంతట తానే పరిశోధనలు చేసి పశువులకి సంబంధించిన అనేక మూలికా వైద్య చిట్కాలు కనుగొన్నాడు. పశువులకి ఎముకలు విరిగినప్పుడు విరిగిన ప్రదేశంలో ముందుగా ఆముదం రాయాలి, ఆ తరువాత మెంతులు, పంచదార కలిపి మెత్తగా నూరి ఆ మిశ్రమానికి పెరుగు జోడించి, ఎముక విరిగినచోట పూయాలి. వెదురు బద్దలు తీసుకొని విరిగినచోట కట్టు కట్టి ఆ కట్టుపైన మినప పిండి, కోడిగుడ్డు లోని తెల్లసొన కలిపి ఆ కట్టుపైన పూతలా పట్టించాలి. రెండు వారాల తరువాత 50 గ్రా. మిరియాలు, 50 గ్రా. కావి (ఆయుర్వేద మందుల దుకాణంలో లభిస్తుంది), 50 గ్రా. పంచదార, కొంత తంగేడు చెట్టు బెరడు, కలబంద కలిపి మెత్తగా నూరి ఒక లీటరు నువ్వుల నూనెలో మరిగించి తయారు చేసుకొన్న తైలాన్ని కట్టు తీసేసి దెబ్బ తగిలిన భాగంలో కొద్ది రోజులు పూయాలి. ఈవిధంగా చేస్తే పశువుల విరిగిన ఎముకలు చక్కగా అతుక్కుని మామూలుగా అవుతాయి అంటున్నాడీయన.

**పశువులలో అజీర్తి చేసినప్పుడు ....**

పశువులకి అజీర్తి చేసినప్పుడు ఇతడు తానే తయారు చేసుకొన్న ఒక మిశ్రమం యిచ్చి వైద్యం చేస్తుంటాడు. ఆ మిశ్రమంలో 50 గ్రా. అల్లం, రెండు మిరప కాయలు, 10 వెల్లుల్లి రెబ్బలు, 10 గ్రా. వాము, 5 తమలపాకులు, 50 గ్రా. పసుపు తీసుకొని వీటన్నిటినీ మెత్తగా నూరి, అజీర్తితో బాధపడుతున్న పశువుకి తినిపిస్తే మంచి గుణం కనిపిస్తుందంటాడీయన.

30206

**పశువులలో వచ్చే కొన్ని జబ్బులకు చిట్కాలు:**

తమిళనాడులోని పుదుక్కోట్టై జిల్లాకు చెందిన వీరమ్మన్

వ్యవసాయ కూలీగా పని చేస్తూనే ఆవులు, గొర్రెలని పెంచుతుంటుంది. ఆమె ఈ వైద్యాలో కొన్ని తను ఇతరుల నుంచి తెలుసుకున్నవి, తన స్వంత అనుభవంతో తెలుసుకున్న వాటితో పశువులకి, మనుషులకి కూడా మూలికా వైద్యం చేస్తుంటుంది.

**పశువులలో గాలికుంటు వ్యాధి నివారణ....**

పశువులలో గాలికుంటు వ్యాధి (ఫుట్ & మౌత్ – ఎఫ్ఎండి) వచ్చినపుడు రెండు అరటి పళ్ళని నువ్వుల నూనెలో ముంచి పశువుచేత తినిపిస్తే మంచి గుణం ఉంటుంది అంటుందామె. అదే గొర్రెలకైతే ఒక్క అరటి పండు చాలట. ఇంకొక పద్ధతి కూడా చెపుతుందామె. చెరువు లోనుంచి చిన్న చిన్న చేప పిల్లలని తెచ్చి వాటిని చితక్కొట్టి ఆ ముద్దని కొద్ది నీటిలో 3 రోజులు మురగబెట్టి ఆ తర్వాత వడగట్టిన నీటిని పశువుచేత తాగించినట్లయితే ఎఫ్.ఎం.డి. తగ్గిపోతుందంటుందామె.



**చిన్న పిల్లలకి జలుబు చేస్తే....**

చిన్న పిల్లలకి జలుబు చేస్తే ఈమె కొన్ని ముళ్ళ వంకాయలు, కొన్ని వరి లాకలు, కొన్ని తుమ్మ ఆకులు, కొన్ని తులసి ఆకులు తీసుకొని కొద్దిగా దంచి, ఆ ముద్దను నీటిలో మరిగించి, ఆ కషాయాన్ని 50 మి.లీ. వేపనూనెలో కలిపి రెండు చెంచాలు పిల్లలకి తాగిస్తే జలుబు నయమయి పోతుంది అంటుందామె.

**పశువులలో జ్వరం, నెమరు వెయ్యకపోవటం.....**

పశువులకి జ్వరం వచ్చినా, లేదా నెమరు వెయ్యకపోయినా వేపగింజలు, కొబ్బరి పీచు నిప్పులపై వేసి ఆ పొగని పశువు ముఖం, శరీరం, వెనకవైపున పట్టిస్తే గుణం కనిపిస్తుందట.

**పశువులలో కడుపుబ్బరానికి చికిత్స......**

పశువులకి కడుపుబ్బరం చేస్తే 10 గ్రా. వాము, 4 తమలపాకులు, 3 వెల్లుల్లిపాయలు, గుప్పెడు మునగాకులు బాగా నూరి, ఆ ముద్దను తినిపిస్తే పశువుకు ఉపశమం కలుగుతుందని చెప్పిందామె.

**పశువుల కడుపులో నులి పురుగులు పడితే చికిత్స....**

పశువుల కడుపులో నులిపురుగులు పడి పశువులు చాలా బాధపడుతుంటాయి. అటువంటి సమయంలో ఎండిన పొగాకుని వేప నూనెలో నానబెట్టి దాన్ని దూది మధ్య ఉంచి తినిపించాలి.

**కీటకాలు కుట్టినప్పుడు చికిత్స.....**

పశువులకు విష కీటకాలు, పాములు, తేళ్లు కుట్టినప్పుడు ఎర్రని దద్దులు వచ్చి మంట పుడుతుంటుంది. అటువంటి సందర్భాల్లో నేల గొలిమిడి లేదా నేల గురుగుడు ఆకు చూర్ణాన్ని చల్లని నీటిలో పరగడుపున తాపిస్తే మంచి ఫలితం ఉంటుంది.

**పశువులలో విరోచనాలకు చికిత్స....**

పశువులు విరోచనాలతో బాధపడుతున్నప్పుడు కిస్కూటా లేదా బంగారుతీగ అనే పరాన్న బుక్కు తీగను తీసుకొని, దాన్ని బాగా దంచి ఆ ముద్దని మూడు రోజులు తినిపిస్తే విరోచనాల బాధనుంచి పశువులకి విముక్తి లభిస్తుంది అంటుందామె.

30214

**వంగ పంటలో పూత రాలకుండా ఉండేందుకు మందు...**



రాజస్థాన్, దుంగర్‌పూర్ గ్రామానికి చెందిన కతరా బాచూ భాయ్ కొంరీ భాయ్ వంగ పంటలో మొక్కలు పూతకి వచ్చి రాలి పోతుంటే నివారించటానికి ఒక చక్కటి చిట్కా చెబుతున్నాడు. పూత రాలిపోయే వంగపంటలో జిల్లేడు ఆకు పొడిని మధ్యాహ్నంపూట 3 రోజులకోసారి 2 లేదా 3సార్లు పొలంలో చల్లితే మంచి ఫలితం వుంటుందని చెబుతున్నాడు. జిల్లేడు ఆకులనుండి తయారు చేసిన రసం లద్దె పురుగు నివారణకి కూడా బాగా పని చేస్తుందట. అంతేకాక ఆకురసం పీల్చే పురుగుల నివారణకు కూడా సహాయకారిగా ఉంటుందట.






- 'హనీబీ' ఆంగ్ల సంచిక సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

కొత్త ఢిల్లీలోని ఐఐసి ఇండియా ఇంటర్‌నేషనల్ సెంటర్‌లో 2023 నవంబరు 28 నుండి డిసెంబర్ 2 వరకు జరిగిన రెండవ ఇన్నోవేషన్ ఉత్సవాలలో పాల్గొన్న ఇన్నోవేషన్‌ల సంక్షిప్త వివరాలు, జాతీయ స్థాయిలో జరిగే ఈ ఉత్సవంలో పాల్గొనటమే గొప్పగా భావిస్తారు ఇన్నోవేటర్లు. - ఎడిటర్



### సునీల్ యస్.ఐ. అక్రోటు రకం:

సునీల్ సింగ్, కిష్త్వార్, జమ్ము & కాశ్మీర్.

**సమస్య:** జమ్ము & కాశ్మీర్ ప్రాంతాల్లో లభించే స్థానిక అక్రోటు కాయలు చవకగా బైట దేశాల నుంచి దిగుమతి చేసుకొనే రకం అక్రోటు కాయల వలన క్రమంగా తమ మార్కెట్ కోల్పోతున్నాయి. ఇంకా పట్టుదలగా స్థానికంగా అక్రోటు వ్యవసాయం చేస్తున్న రైతులు వ్యవసాయ ఖర్చులు పెరిగి, కాయలు కొయ్యటానికి చెట్ల పైకి 50–60 అడుగుల ఎత్తు ఎక్కటం కష్టతరమై పోతోంది. తరతరాల నుండి చేస్తున్న అక్రోటు రకాలను కాపాడాలనే ప్రయత్నాలు జరుగుతున్నా, ఈ వ్యవసాయం లాభసాటిగా సాగటం లేదు. చాలామంది రైతులు తక్కువ కాయలు కాస్తుండటంతో ఈ అక్రోటు వ్యవసాయం నుండి తప్పుకుంటున్నారు.

**పరిష్కారం:** ఇన్నోవేటర్ సునీల్ ఒక మొక్కలోని మొగ్గని అంటు కట్టడం ద్వారా 98% విజయ వంతంగా ఒక్క తల్లి చెట్టు నుంచి దాదాపు 10 వేల మొక్కలని తయారు చేశాడు. దీన్ని తను కేవలం సేంద్రియ పద్ధతిలోనే పెంచాడు. ఎటువంటి రసాయనాలు వాడలేదు. ప్రతి చెట్టు ఇదివరకటి కంటే 3 రెట్లు అంటే 120–300 కిలోల కాయలు ఇస్తుంది. పొట్టి రకం చెట్టు కనక కేవలం 20–30 అడుగులు మాత్రమే పెరుగుతుంది. ఒకే సైజు కాయలు కాయటమే కాక, ఈ రకం చీడ పీడల నుంచి తనని తాను రక్షించుకొంటుంది.

**సమాజంపై ప్రభావం:** సాధారణ స్థానిక అక్రోటు చెట్లలో రకరకాల సైజుల కాయలుండి గ్రేడింగ్ చేసుకోవాల్సి రావటం వల్ల మార్కెట్ చేయడం కష్టంగా ఉండేది. చిన్న కాయలు, పెద్దగా ధర పలకవు. పెద్ద కాయల సంఖ్య తక్కువగా ఉండేది. కానీ ఈ 'సునీల్ యస్.ఐ.' రకంలో కాయలన్నీ ఒకేసైజుతో, మంచి రకంగా ఉండి కిలోకి రూ. 400/– దాకా రేటు పలుకుతుంది. పప్పుకైతే రూ.

వీడియో కొరకు స్కాన్ చెయ్యండి



1,000/-ల వరకు ధర పలుకుతుంది. చెట్టు పొట్టిగా ఉండటంతో కొయ్యటం సులభమని, కూలీల ఖర్చులు, చెట్టుపై నుండి పడిపోయి దెబ్బలు తగిలించుకోవటం, ఒక్కోసారి ప్రాణాపాయం కూడా జరుగటం లాంటివి కూడాఉండేవి. ఇప్పుడు ప్రాణాపాయం లాంటివి ఉండవు.

**ప్రస్తుత పరిస్థితి :** ఈ ఇన్నోవేటర్ జాతీయ హార్టికల్చర్ బోర్డులో దీన్ని రిజిష్టర్ చేసుకున్నాడు. పండ్లు, కూరగాయలు రిజిష్టర్ చేసే పిపివి & ఎఫ్ఆర్ఎ సంస్థలో కూడా రిజిష్టర్ చేసే ప్రయత్నాలు జరుగుతు న్నాయి. ఈయన ఇప్పటికే కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, తూర్పు ఉత్తర రాష్ట్రాల్లో ఈ రకాన్ని ప్రవేశ పెట్టాడు.

## అభివృద్ధి పరిచిన హైడ్రో స్ర్కూటర్బైన్ జనరేటర్:

**ఖుర్షీద్ అహ్మద్ మాలిక్ ఇట్టూ,**

అనంతనాగ్, జమ్ము & కాశ్మీర్.



**సమస్య:** జమ్ము కాశ్మీర్ ప్రాంతంలో కావలసినన్ని సెలయేళ్ళు, వాగులు ఉన్నా, పర్యావరణ, భౌగోళిక పరిస్థితుల కారణంగా నీటిపైన డ్యాములు కట్టి విద్యుత్తును ఉత్పత్తి చేసేందుకు వీలుగా ఉండదు. కావున ఎప్పుడు తక్కువ కరెంటు బాధలే. ఈ పరిస్థితి గమనించిన అహ్మద్ మాలిక్ ఈ చిన్న పరికరం జల విద్యుత్ జనరేటర్‌ని రూపొందించాడు. దానిని పారే నీరున్న ఏ ప్రదేశంలోనైనా ఏర్పాటు చేసుకోవచ్చు. గొప్ప విషయం ఏమిటంటే కావలసిన చోటికి దీనిని సులభంగా తీసుకొని వెళ్ళవచ్చు.

వీడియో కొరకు స్కాన్ చెయ్యండి

**సాంకేతికత :** ఈ టర్బైన్‌ను ఎక్కడికైనా తీసుకు వెళ్ళవచ్చు. తేలికగా ఉంటుంది. నీటిలో నగం తేలుతుంటుంది. జల విద్యుత్ ఉత్పత్తి చెయ్యటానికి చాలా వీలుగా ఉంటుంది. ఇది నీటి మట్టాన్ని బట్టి ఎంత విద్యుత్తుని ఉత్పత్తి చెయ్యాలో తనే నిర్ణయించుకుంటుంది. ఇది ప్రవహించే నీటి వేగం, లోతు మీద ఆధారపడి ఉంటుంది. ఏ విధమైన కట్టడాలు కట్టనవసరం లేదు. కేవలం ప్రవహించే నీళ్ళుంటే చాలు. ఈ తేలే టర్బైన్ కెపాసిటీ 1 కె.వి. నుంచి 500 కె.వి. వరకు ఉంటుంది. (నీటి వేగం, లోతు మీద ఆధారపడి)



**సమాజంపై ప్రభావం :** ఇన్నోవేటర్ చెప్పిన దాని ప్రకారం ఈ జనరేటర్‌ని ఎక్కు సంఖ్యలో వాడితే ఎక్కువ విద్యుత్తు ఉత్పత్తి అయి పరిశ్రమలు వచ్చి (చిన్న చిన్న మైనర్) ఉద్యోగాలు లభించి, ఆర్థిక అభివృద్ధి జరుగుతుంది. దీనిని ఏర్పరచుకోవటం చాలా సులభం. ఖర్చు చాలా తక్కువ. రిపేర్లు వచ్చే అవకాశం చాలా తక్కువ. హిమాలయ పరిసర ప్రాంతాల్లో చిన్న సెలయేళ్ళు, వాగులు, నదులు ఉన్న ప్రదేశాలలో చాలా సులభంగా ఏర్పాటు చేసుకోవచ్చు. చిన్న పరిశ్రమలు స్థాపించుకొని ఉపాధి, ఉద్యోగావకాశాలు పెంపొందించుకోవచ్చు.

**ప్రస్తుత పరిస్థితి :** ఇన్నోవేటర్ "వ్యాలీ హైడ్రోటెక్" అనే చిన్న కంపెనీ ప్రారంభించాడు. దానిలో ఈ జనరేటర్ల ఉత్పాదన ప్రారంభించి అమ్ముకొంటున్నాడు. ఈమధ్య ఈయన ఒక జనరేటర్‌ని అనంతనాగ్ లో ఏర్పాటు చేశాడట. అది 4.5 కె.వి. సామర్థ్యం గల విద్యుత్తును ఉత్పత్తి చేస్తోంది. ఇంతకు ముందు ఇతను తన స్కూల్లోని వాటర్ ట్యాంకుకు ఒక వాల్వ్‌ను కనిపెట్టి 'జిఎఐఎన్' (గియాన్) పురస్కారం పొందాడు. ఎన్ఐఎఫ్ ఈ విద్యుత్ జనరేటర్‌ను రూపొందించడానికి, దాని మార్కెటింగ్ కు సహకరించింది.

## సులభంగా అక్రోటు కడిగే యంత్రం:

**నాయక్ ఖయూమ్,** అనంతనాగ్, జమ్ము & కాశ్మీర్.



**సమస్య:** అక్రోటు కాయలను చెట్టునుండి కోసిన తరువాత లేదా నేలపై రాలిన కాయలను తీసి కడగటం అన్నది చాలా కష్టమైన పని. దానికి చాలా సమయం, ఖర్చు, మనుషులు అవసరం అవుతారు. దాదాపు గంటకు 40 కిలోల కాయలను ఇద్దరు మనుషులు కడుగగలుగుతారు. అయినా పూర్తిగా శుభ్రంగా ఉండవు. కొందరు రైతులు 'ఏసిడ్'తో కడగటానికి ప్రయత్నించారు. చూడటానికి బాగున్నా పప్పు రుచి మారిపోయి, మార్కెట్‌లో మంచి ధర పలకలేదు.

వీడియో కొరకు స్కాన్ చెయ్యండి

**సాంకేతికత :** ఈ పరికరం సింగల్ ఫేస్ మోటారు సహాయంతో మరియు పుల్లి బెల్ట్ పద్ధతిలో పని చేస్తుంది. వైరు బ్రష్షుల సహాయంతో యివి అక్రోటు కాయలను శుభ్రం చేస్తాయి. ఒక్కసారి వేసిన కాయలను 5-7 నిమిషాలలో శుభ్రపరుస్తాయి. ఈ పరికరం వేరువేరు సైజులలో లభిస్తుంది. అన్నింటికన్న పెద్ద సైజు పరికరం గంటకి 480 కిలోల కాయలను శుభ్రం చేస్తుంది. ఒక్క మనిషి ఉంటే చాలు.

**సమాజంపై ప్రభావం :** ఇన్నోవేటర్ చెప్పినదాని ప్రకారం ఒక్కసారి కాయలను కడగటానికి కేవలం 20 లీటర్ల నీరు అవసరం అవుతాయి. చాలా నీటిని, సమయాన్ని, ఖర్చును, మానవ వనరులను ఆదా చెయ్యవచ్చు. హానికర రసాయనాలను వాడటం నివారించవచ్చు. మార్కెట్‌లో దొరికే ఇతర యంత్రాలతో పోలిస్తే యిది చాలా చవక, వాడటం సులభం. ఈ ఇన్నోవేటర్ స్కూల్లో చదువుకున్నప్పటి నుంచి జిఎఐఎన్ (గియాన్) వారి పర్యవేక్షణలో ఉన్నాడు. ఇతర ఇన్నోవేటర్ లకు మార్గదర్శిగా ఉండగల ప్రాముఖ్యత సంపాదించాడు.




**ప్రస్తుత పరిస్థితి :** ఈ యంత్రాన్ని హొంచి అక్రోటు కాయలని పూర్తిగా బయటకు తీసేలా ఏర్పాటు చేశాడు. మొదటి సంవత్సరంలోనే ఇతను 5 చిన్నవి, 5 పెద్ద యంత్రాలు విక్రయించాడు. వాడిన వారంతా బావుందన్నారట. చిన్నవి రూ. 18,000/–, పెద్దది రూ. 22,000/–లకి విక్రయిస్తున్నాడు. ఎక్కువ సంఖ్యలో ఉత్పత్తి చెయ్యటానికి నిధులు సేకరిస్తున్నాడు. జమ్ము కాశ్మీర్ ప్రభుత్వం వారు వారి వార్షిక ప్రదర్శనలో ఉత్తమ స్టార్టప్ కంపెనీగా సన్మానించారు.

## అభివృద్ధి చేసిన సులభంగా తీసుకొని వెళ్ళగలిగిన 'బుకారి'(గదిని వేడి చేసే పరికరం):

### తౌసిఫ్ అహమ్మద్ & రఫిక్ అహంగర్,

కిష్టివర్, జమ్ము & కాశ్మీర్.



వీడియో కొరకు స్కాన్ చెయ్యండి

**సమస్య:** సాంప్రదాయంగా మంచు, చలి ప్రదేశాలలో గదిని వేడి చేసుకోవడానికి 'బుకారీ'లు వాడుతారు. వాటిలో బొగ్గు, కట్టెలు సరిగ్గా కాలక పొగ వచ్చి, ఊపిరాడక ఉబ్బసం వ్యాధులు వచ్చి కాలేయం చెడిపోయే ప్రమాదం ఉండేది. వాటితో పాటు బొగ్గు, కట్టెలకి చాలా ఖర్చయ్యేది.

**సాంకేతికత :** ఈ పరికరంలో కట్టెలను కాల్చే ముందే వేడి చెయ్యటానికి ఒక అర ఉంటుంది. కట్టెలను వెలిగించటానికి పైన ఒక చిన్న కన్నం ఉంటుంది. దీనితో కేవలం 5 నిమిషాలలో గదంతా 0–20 డిగ్రీల వేడికి చేరుకుంటుంది.

**సమాజంపై ప్రభావం :** ఇన్నోవేటర్ చెప్పినదాని ప్రకారం ఈ అభివృద్ధి



చేసిన 'బుకారి'లు ఎక్కడికైనా తీసుకెళ్ళటానికి వీలవుతుంది. తేలికగా, బరువు లేకుండా ఉంటాయి. ఎక్కువ సమయం, తక్కువ ఇంధనంతో పని చేస్తాయి. దీనిలో బొగ్గు, కట్టెలు లేదా పాత నూనె కూడా వాడవచ్చు. నూనెతో పొగ లేకుండా చాలా సేపు వేడిగా ఉంటుంది. సమర్థవంతంగా పని చేస్తుంది.

**ప్రస్తుత పరిస్థితి :** గతంలో ఈ ఇన్నోవేటర్‌ల జంట తయారు చేసిన 'బుకారీ'ని ఎన్ఐఎఫ్ వారు బహుమానంతో సత్కరించారు. ఇప్పుడు దీనినే అభివృద్ధి చేసి తయారు చేశారు వారు. 'రఫిక్ ఇన్నోవేషన్' అనే సంస్థ స్థాపించి, భారీ సంఖ్యలో బుకారీలు తయారు చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ●

### ఈ ఉత్సవంలో పాల్గొన్న తెలుగు ఇన్నోవేటర్లు

**కొడిముంజ ప్రవీణ్** - మల్బరీ మొక్కలను కత్తిరించి, కట్టలు కట్టే పరికరం.
**గోదాసు నర్సింహ** - చెరువుల్లో 'గుర్రపుడెక్క' తీసివేసే యంత్రం.
**అల్లాడి ప్రభాకర్** - నడవలేని వ్యాధిగ్రస్తులకు పనికి వచ్చే మంచం.
**మోధా శివకుమార్** - చేనేతలో పెడల్ లిఫ్టింగ్ యంత్రం.
**శ్రీమతి దూబ రాజు** - సహజ పంటలతో క్లీనింగ్ ద్రావణాలు.
**మెండె శ్రీనివాస్** - పొలాలకు, ఇళ్ళకు నీరు తోడేందుకు రోబో.
**నవంబర్-2025 న జరిగిన 4వ ఉత్సవంలో పాల్గొన్నావారు :**
**చింతకింది నరేందర్** - పోచంపల్లి నేతలో డిజైన్‌మార్కింగ్ యంత్రం.
**షేక్ భాషా** - మోటార్ సైకిల్‌కు వ్యవసాయ పరికరాల అమరిక.
**శ్రీనివాస రావు** - చేపల చెరువుల్లో ఏరియేటర్.

# ఆయుర్వేద జ్ఞాన మథనం

## ఇంటిలో ఉన్న వస్తువులతోనే 'మన ఆరోగ్యం మన చేతుల్లో'


ఉమా మహేశ్వర రావు

మనకు ఇంట్లో వున్న వస్తువులతోనే 'మన ఆరోగ్యం మన చేతుల్లో' ఉండే విధంగా, చాలా రకాల రుగ్మతలు, బాధల నుంచి విముక్తి పొందవచ్చు.

### జలుబు, దగ్గు, ఆయాసం, గొంతు నొప్పికి వైద్యం:

పైన తెలిపిన జబ్బుల నివారణకు, ఉపశమనం కొరకు 'యాలక్కాయలు, దాల్చిన చెక్క కొద్ది కొద్దిగా సమయంగా తీసుకుని, వీటికి తోడు ఒక జాజికాయ తీసుకుని మూడింటిని మెత్తటి పొడిగా చేసి ఒక గాజు సీసాలో భద్రపరచుకొని ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం అర చెంచాడు పొడిని చేతిలో వేసుకుని అందులో కొద్దిగా తేనె వేసుకుని ఒక వారం పాటు నాకినట్లయితే పైన చెప్పిన జబ్బుల నుండి ఉపశమనం పొందవచ్చు. చిన్న పిల్లలకైతే పావు చెంచా పొడిని తేనెలో కలిపి ఉదయం, సాయంత్రం నాకించాలి. దీనితో పాటు వేడి పాలలో కొద్దిగా శొంఠిపొడి, బెల్లం వేసి కలుపుకుని తాగుతున్నట్లయితే పైన చెప్పిన నాలుగు జబ్బులను దరిచేరనీయకుండా చేసుకోవచ్చు.

### మైగ్రేన్ తలనొప్పి (దీన్నే పార్శ్వపు నొప్పి అంటారు) నివారణకు:

మైగ్రేన్ తలనొప్పి విపరీతంగా వచ్చినప్పుడు కొంతమంది తమ తలను గోడకేసి కొట్టుకుంటూ ఉంటారు. అంత భయంకరంగా ఉంటుందా నొప్పి. తల బద్దలైపోతోంది అంటుంటారు. కడుపులో తిప్పటం, లైట్లు చూసినా ఇబ్బంది అవుతుంది కొందరికి. దీని నివారణకు కేవలం శొంఠి, బెల్లం పొడిగా చేసుకుని బట్టలో ఒక చిన్న మూట కట్టి దగ్గర ఉంచుకుని, దాన్ని ముక్కు వద్ద పెట్టుకుని అప్పుడప్పుడూ వాసన చూస్తూ ఉండాలి. దీన్ని మైగ్రేన్ తలనొప్పి వచ్చేవారు తలనెప్పి ఉన్నా, లేకున్నా ఇలా చేస్తూ ఉన్నట్లయితే ఆ నొప్పి వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. కనీసం ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం 4–5 రోజుల పాటు నొప్పి ఉన్నా, లేకపోయినా వాసన చూస్తూ ఉన్నా చాలు మంచి ఫలితం ఉంటుంది. లేదా కుంకుడు కాయ, బెల్లం పొడి మూట కట్టి వాసన చూస్తూ ఉన్నా కూడా మైగ్రేన్ తలనొప్పి రాదు.

ఇలా చేయటంతో పాటు, మైగ్రేన్ తలనొప్పి బాధ ఉన్నవారు తేలిగ్గా అరిగే ఆహారం తీసుకుంటూ ఉండటం మంచిది. ఎక్కువగా సగ్గుబియ్యం జావా తాగుతూ ఉంటే మంచిది.

### నోటిపూత నివారణకు:

కొందరికి నోటిలో పూత రావటం వల్ల చాలా ఇబ్బంది పడుతూ ఉంటారు. అటువంటప్పుడు వాళ్ళు ఏది తినాలన్నా ఇబ్బంది పడుతుంటారు. అటువంటి వారు 'పటిక' (దీన్నే హోలం అంటారు) తీసుకుని పెనంమీద పెట్టి వేడి చేసినట్లయితే అది నీరుగా మారుతుంది. తర్వాత అది చల్లారితే మళ్ళీ గడ్డ కడుతుంది. ఆ గడ్డను మెత్తటి పొడిగా చేసుకుని, ఆ పొడిని నీటిలో వేసుకుని కలిపి నోట్లో వేసుకుని బాగా పుక్కిలించి ఉమ్మినట్లయితే నోటిపూత తగ్గిపోతుంది, ఆహారం రుచి కూడా బాగా తెలుస్తుంది. దీన్ని కొందరు నోటికి ఏ రుచీ ఆనటం లేదు అన్నవారు కూడా చేస్తే మంచిది.



ఇటువంటి జబ్బు ఉన్నవారు ఎక్కువగా దానిమ్మ పండు తింటూ ఉన్నట్లయితే నోటి పూత రాదు.

### గ్యాస్, ఎక్కిళ్ళు, త్రేన్పులు నుండి ఉపశమనానికి:

కొంతమంది గ్యాస్ వచ్చింది, పొట్ట ఉబ్బరంగా ఉంది, త్రేన్పులు, పిత్తులు విపరీతంగా వస్తున్నాయి అంటుంటారు. తేలికగా మల విసర్జన కాకపోవటం కూడా జరుగుతూ ఉంటుంది. ఇటువంటి వారు ధనియాలు, జీలకర్ర, వాము, సోంపు ఈ నాలుగింటిని మెత్తటి పొడిగా చేసుకుని ఒక గాజు సీసాలో భద్రపరచుకోవాలి. వీలైతే అందులో కొంత ఉప్పు కలిపినా ఫర్వాలేదు. ఈ పొడిని ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ఒక చెంచాడు పొడిని భోజనానికి ముందు లేదా తర్వాత అయినా సరే నోట్లో వేసుకుని తింటూ ఉండాలి. ఇటువంటి జబ్బు ఉన్నవారు సాయంత్రం పడుకునే ముందు బొప్పాయి, ఖర్జూరం, ఖర్బూజ, జామకాయ, దోసకాయ వీటిలో ఏదో ఒకటి తీసుకున్నా, లేదా గోరువెచ్చని నీటిలో కొద్దిగా నిమ్మరసం కలుపుకుని త్రాగినట్లయితే మల విసర్జన తేలికగా అవుతుంది, గ్యాస్ కూడా ఏర్పడే అవకాశం ఉండదు.

### కడుపులో నొప్పి నివారణకు:

కడుపు నొప్పి మనకు చెప్పి రావచ్చు. 24 గంటల్లో ఏ సమయంలోనైనా రావచ్చు. వాతపు వేళ ఎక్కువగా కడుపు నొప్పి వచ్చే అవకాశం ఉంటుంది. ఇటువంటి వారు ఒక చెంచాడు వాము, ఒక చెంచాడు ఉప్పు, 10 మిరియాలు కలిపి మెత్తటి పొడిగా చేసుకుని ఆ పొడి అయిపోయే దాకా ప్రతిరోజూ ఉదయం సాయంత్రం రెండు చిటికెల పొడిని నోట్లో వేసుకుంటూ ఉన్నట్లయితే కడుపు నొప్పి ఎప్పటికీ రాదు. ఒకవేళ వచ్చినా, ఈ పొడి వేసుకున్నట్లయితే వెంటనే తగ్గి పోతుంది. దీన్ని పిల్లలు, పెద్దలు, వృద్ధులు ఎవరైనా వాడుకోవచ్చు.

### మోకాళ్ళ నొప్పుల నివారణకు:

ప్రస్తుతం చాలామంది బాగా ఇబ్బందికి గురి చేస్తున్న రోగం మోకాళ్ళ నొప్పులు, వెన్ను నొప్పి, మెడనొప్పులు. ఈ మూడు రకాల నొప్పులు ఉన్నవారు వేరుశనగ విత్తనాలు, కొబ్బరి, మెంతులు, నల్ల నువ్వులు, మినుములు తీసుకుని (అన్నీ పచ్చివే, వేయించవద్దు) మెత్తటి పొడిగా చేసుకుని, ప్రతిరోజూ భోజనంలో ఒకటి రెండు చెంచాల పొడిని కలుపుకుని తిన్నట్లయితే పైన చెప్పిన మూడు నొప్పుల నుండి చాలా వరకు ఉపశమనం పొందవచ్చు. ఇవన్నీ కలిపితే మంచి జిగురు పదార్థం అయి శరీరానికి అందిస్తాయి. ఎముకల్లో జిగురు పదార్థం పెరగటం వల్ల ఈ నొప్పులన్నీ తగ్గిపోతాయి. ఈ పొడిని ఒక పదిరోజులు వాడి తర్వాత నాలుగు రోజులు విరామం ఇచ్చి, మళ్ళీ ఒక పదిరోజులు వాడి, మరో వారం విరామం ఇస్తూ, ఇలా 2–3 నెలల పాటు ఉపయోగించినట్లయితే ఎముకల్లో బాగా జిగురు చేరి, నొప్పుల నుండి నివారణ పొందవచ్చు. ●

**గమనిక:** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' ఉమా మహేశ్వర రావు ఫోన్ నెం.: 9440286854



# వర్షాకాలంలో ఆరోగ్యం కోసం పకృతిలో లభించే ఆకు కూరలు

ప్రస్తుతం వర్షాలు విరివిగా కురుస్తున్నాయి. పొలాల గట్ల వెంట, బీడు భూముల్లో కలుపు మొక్కలు బాగా పెరుగుతున్నాయి. వాటిలో సాగు చెయ్యని ఆకు కూరలు ఎన్నో మనకు లభిస్తాయి. వాటివల్ల ఆరోగ్యానికి ఎంతో ఉపయోగం చేకూరుతుంది. మన ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఈ సాగు చెయ్యని ఆకు కూరలు దాదాపు 120 దాకా ఉన్నాయి అనేది అక్షర సత్యం. అయితే మన చుట్టూ 50కి పైగా కనిపిస్తూ ఉంటాయి. మనం దారి వెంట పొలానికో, మన చుట్టు ప్రక్కలనో కనిపించేవి కొన్ని ఉంటాయి. వాటిని గురించి తెలుసుకుని మన ఆహారానికి వినియోగించుకుంటే బాగుంటుంది. అవి మన ఆరోగ్యానికి ఎలా పని చేస్తాయో తెలుసుకుందాం. రైతులు సాగు చెయ్యకుండా మనకు లభించే ఆకు కూరలు ఇవి.

**గలిజేరు - దీన్నే సంస్కృతంలో 'పునర్నవ' అంటారు:**

ఇందులో రెండు రకాలుఉంటాయి. మొదటిది తెల్ల గలిజేరు, రెండవది ఎర్ర గలిజేరు. వీటిల్లో తెల్ల గలిజేరు శ్రేష్ఠమైనది. ఎర్ర గలిజేరు కూడా ఉపయోగించుకోవచ్చు. ఈ మొక్కలు మీకు కనిపిస్తే వాటి ఆకులను సేకరించుకుని, నీటిలో బాగా కడిగి, పులుసు కూర లేదా పప్పు లో వేసుకుని వండుకు తినాలి. వేపుడు కూరగా కూడా చేసుకోవచ్చు,



కానీ వేపుడుకన్నా పులుసు కూర లేదా పప్పులో వేసుకుని ఒండుకోవటం వల్ల మంచి గుణాలు ఉంటాయి. ఈ గలిజేరు కూర తినటం వల్ల 'కిడ్నీ సంబంధిత' రోగాలు పూర్తిగా నయ మయ్యే అవకాశాలు ఎక్కువ. డయాలసిస్ చేసుకుంటున్న రోగు లు కూడా దీన్ని వాడినట్లయితే మంచి ఫలితాలను త్వరగా పొందవచ్చు. దీని సంస్కృత నామమం 'పునర్నవ' లోనే అర్థం ఉంది. అవ యవాలకి కొత్త జీవితాన్ని ఇచ్చేది అన్న ఈ పేరులో వస్తుంది. అంత బాగా మన ఆరోగ్యానికి పని చేస్తుందన్న మాట. కేవలం కిడ్నీల కోసమే కాదు, 'కండరాల బల హీనత, ఎముకల బలహీనత, చర్మ సమస్యలు, కంటి మరియు చెవి సమస్యలు, తలలో జుట్టు రాలిపోయే సమస్యలు' అన్నిటి పైనా పని చేస్తుంది. అంతే తల వెంట్రుకల నుంచి కాలి గోటి దాకా అన్ని రకాల అవయువాలపై ఇది చాలా బాగా పని చేస్తుంది. అయితే దీన్ని ప్రతిరోజూ వండుకుని తీసుకో కూడదు. వారానికి ఒక్కసారి లేదా రెండుసార్లు చొప్పు తీసుకుంటే మంచిది.

**పాల ఆకు (పాలకూర (పాలక్) కాదు) :**



దీని ఆకును తెంపినట్లయితే పాలు కారుతాయి. దీన్నే పచ్చ బొట్లాకు అంటారు. ఈ పాలతోనే పూర్వం పచ్చ బొట్లు పొడిచేవారట! దీన్నే 'రెడ్డివారి నానుపాలు' అని కూడా అంటారు. ఈ ఆకులను తెచ్చుకుని నీటిలో బాగా కడిగి, పప్పులో రెండు మూడు గుప్పెళ్ళ ఆకు వేసుకుని, మెత్తగా ఎనిపి తీసుకున్నట్లయితే ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో ఇనుము (ఐరన్) బాగా ఉంటుంది. అంతే కాదు ఇది కంటి జబ్బులకు, కీళ్ళ నొప్పులకు వంట్లో ఉన్న చెడు నీటిని తీసివేయటానికి, వర్షాకాలం వచ్చే జలుబులు, జ్వరాలు, వళ్ళు నొప్పులను బాగా నివారి స్తుంది.

**వామింటాకు:**

ఈ మొక్క పసుపు రంగు పూలను కలిగి ఉంటుంది. ఆ ఆకును మరియు పూలను కూడా సేకరించి పాల ఆకు మాదిరిగానే



వప్పులో వేసుకుని తింటే ఆరోగ్యానికి ఎంతో మంచిది. కాకపోతే ఈ ఆకు వప్పులో వేసుకున్నా, కూరగా చేసుకున్నా కొద్దిగా జిగటగా ఉంటుంది. ఈ ఆకుతో చేసిన పప్పు తినటం వల్ల వర్షాకాలం వచ్చే విష జ్వరాలు రావు. 'వర్షాకాలంలో ఒక్కసారైనా వామింటాకు కూర తినాలి' అనే సామెత కూడా ఉంది. వర్షాకాలంలో చా లా మందికి ఇమ్యూనిటీ పవర్ (రోగ నిరోధక శక్తి) చాలా తక్కువగా ఉంటుం ది. అందుకే వర్షాకాలంలో జలుబు, తుమ్ములు, ముక్కులో నీరు కార టం, జ్వ రాలు ఎక్కువగా వస్తుంటాయి. కాబట్టి ఈ వామింట కూరను పప్పు చేసుకుని తినటం వల్ల పైన చెప్పిన సమస్యలన్నీ తగ్గటమే కాక, శరీరంలో ఇమ్యూనిటీ పవర్ పెరుగుతుంది. శరీంలో వున్న చెడు నీటిని తీసివేయటంలో ఈ వామింట చాలా పెద్ద పాత్ర పోషిస్తుంది.

**తగిరస (చక్రమర్ద, తుంటెప) ఆకు:**

వర్షాకాలం ప్రారంభమైన తర్వాత మనకు మొట్టమొదట కనిపించే చెట్టు ఇదే. ఇది భూమినుండి సుమారు రెండు అడుగుల ఎత్తు వరకు పెరుగుతుంది, పచ్చని పూలు పూస్తాయి, దీని ఆకులు బాగా విచ్చుకుని ఉంటాయి. దీన్ని రోడ్డు పక్కన చూసినట్లయితే ఈ మొక్క క్రింద వర్షం పడినా భూమి తడవదు అన్నంతగా ఆకులు విచ్చుకుని ఉంటాయి. ఈ తగిరస ఆకును తీసుకుని పులుసు కూరగా లేదా పప్పులో



వేసుకుని తినవచ్చు. వైద్యంలో కూడా దీని గురించి చాలా ప్రస్తావన ఉంది. దీని గింజలు తీసుకుని రసంతీసి మోకాలి నొప్పులకు వాడుతారు. చర్మ రోగాలకు, తెగిన గా ●

**గమనిక :** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

**'వైద్య' కొమెర అంకారావు (జాజి), ఫోన్ : 9908411700**

**గత సంచిక (జులై–అగస్టు–2025) ఎడిటోరియల్‌కు పాఠకులు, శ్రేయోభిలాషుల నుండి లభించిన స్పందన**

యూరియాకు రూ. 1,900/–, డిఎపి కి రూ. 500/–, మిగతా రసాయనిక ఎరువులకు సబ్సిడీ ఇస్తున్న ప్రభుత్వం ఎరువులు వాడకుండా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు ప్రోత్సాహకాలు ఎందుకు ఇవ్వడం లేదు? **– ముళ్ళపూడి సత్యనారాయణ,** మణుగూరు, భద్రాద్రి జిల్లా.

ఈ చర్చా వేదిక చాలా మంచిది, రైతులకు పూర్తిగా ఉపయోగ పడేది. కావున మీరు పల్లెసృజన ద్వారా ప్రజలను చైతన్య పరచగలరు. ముఖ్యంగా రసాయనిక ఎరువులు, పురుగు మందులు తగ్గించే విధానంగా మరియు ప్రకృతి వ్యవసాయం విధానాల గురించి చర్చా వేదికలో ముఖ్యంగా చేర్చండి. రైతు నష్టపోవడానికి ముఖ్యమైన కారణాలు నాలుగు. 1 – వేసే విత్తనం కూడా కొనుక్కొని వేయటం. 2– రసాయనిక ఎరువులు. 3– ముఖ్యమైనది రసాయనిక పురుగు మందులపైన ఆధార పడటం. 4– మన పంటకు విలువను జోడించి అమ్మాలి. వీటికి ప్రత్యామ్నాయాలు వస్తే తప్ప రైతు బాగుపడే పరిస్థితిలో లేదు.

ఆర్గానిక్ ఫార్మింగ్ అంటే 'బయో ఫర్టిలైజర్ (చెత్త చెదారాన్ని సంచిలో నింపుతారు. దానికే సర్టిఫికెట్ ఉండదు), బయో పెస్టిసైడ్స్ (సీసాలో ఎర్రనీళ్ళు, పచ్చనీళ్ళు కలిపినవి) దానికీ ఏ సర్టిఫికెట్ ఉండదు. ఇప్పుడున్న రసాయన ఎరువులు, పురుగు మందుల లాగే బజార్లో అమ్ముతారు. వాటిని రైతులు బయో ఫర్టిలైజర్, ఆర్గానిక్ మందులు అని కొని వాడాలి. మళ్ళీ రైతులు వ్యాపారుల పైన ఆధార పడటమే. అందులో రైతుకు ఏమాత్రం ఉపయోగం లేదు. కొన్ని రోజులు లేదా సంవత్సరాల తర్వాత ఆర్గానిక్ మందులకు కావలసినంత ధరలు పెంచుతారు. అందుకే సహజ వ్యవసాయం (ప్రకృతి వ్యవసాయం) ఉత్తమమైనది అని నా అభిప్రాయం. ఇందులో రైతు కొనేవి ఏవీ ఉండవు. స్వయంగా తయారు చేసుకునేవే, ప్రకృతి ప్రసాదించినవి వాడుకోవటమే. **– పోచా చిన్న నాగిరెడ్డి,** కర్నూలు.

అందరికీ నమస్కారం. ముందుగా వ్యవసాయం చేసేటటువంటి రైతు సోదరులకు సేంద్రియ వ్యవసాయం అంటే ఏమిటి? దానిమీద పూర్తిగా అవగాహన అనేది రావాలి, అవగాహన కల్పించాలి. అలాగే ప్రకృతి వ్యవసాయం మరియు సహజ వ్యవసాయంలో ఎలాంటి శ్రమ ఉంటుంది, ఖర్చు ఎలా ఉంటుంది. సేంద్రియ వ్యవసాయంలో దానికి కావలసిన కషాయాలు తయారు చేసుకోవటానికి శ్రమ ఎలా ఉంటుంది, ఖర్చు ఎలా ఉంటుంది. వీటన్నిటిమీద రైతు సోదరులకు పూర్తిగా అవగాహన కల్పించినపుడే సేంద్రియ వ్యవసాయం అనేది లేకుండా సహజ వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపే అవకాశం ఉంటుంది. **– చౌదరి,** తాడిపత్రి.

"వ్యవసాయం" అంటే.... మనిషి మట్టితో చేసే స్నేహం. అంతేగానీ..... మందులతోనో, కషాయాలతోనో, మరి దేనితోనో కానే కాదు.

**– రమేష్,** హైదరాబాద్.

ఈ పరిస్థితుల్లో రైతులు వారి గ్రామాన్ని ఒక యూనిట్‌గా చేసుకొని, వాళ్ళకు కావలసినవి సహజ పద్ధతిలో పండించుకొని మిగతా పొలంలో రసాయనాలతో పక్కా వ్యాపార దృక్పథంతో పండిస్తే, అవి తినే వాళ్ళ నుండి వత్తిడి వచ్చి మన దారిలోకి వస్తారు.

**– నారాయణ రెడ్డి,** నిజామాబాద్


## FORM IV


**PALLESRUJANA R.N.I. No. APTEL 12136/01/1/2011-TC**

| | |
|---|---|
| 1. Place of publication | : Ranga Reddy Dist |
| 2. Periodicity of its publication | : Bi-Monthly |
| 3. Printer's Name | : Narendra Grafix |
| Nationality | : Indian |
| Address | : 1-1-336/53, Vivek Nagar, Chikkadpally, Hyderabad - 500 020. |
| 4. Publisher's Name | : P. Ganesham |
| Nationality | : Indian |
| Address | : P.No.102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Ranga Reddy Dist. A.P. |
| 5. Editor's Name | : P. Ganesham |
| Nationality | : Indian |
| Address | : 102, Vayupuri, Sainikpuri Post, Secunderabad. |
| 6. Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. | : N.A. |

I, P. GANESHAM, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date 28-4-2011

Signature of Publisher






26 అక్టోబర్, 2025న హైదరాబాద్ శివారులలోని 'స్వర్ణభారతి ట్రస్ట్' ప్రాంగణంలో జరిగిన "రైతునేస్తం ఫౌండేషన్ అవార్డు-2025" కార్యక్రమంలో 'కొత్త ఆవిష్కరణల విభాగం'లో మన పల్లెసృజన ఇన్నోవేటర్ "కొడిముంజ ప్రవీణ్" ను మాజీ రాష్ట్రపతి శ్రీ వెంకయ్య నాయుడు గారు సత్కరించటం జరిగింది. అక్కడ ప్రవీణ్ ఇటీవల ఆవిష్కరించిన 'మల్బరీ మొక్కలు కత్తిరించి, కట్టలు కట్టి ఇచ్చే' యంత్రాన్ని ప్రదర్శించడం కూడా జరిగింది. శ్రీ వెంకయ్య నాయుడు గారు సందర్శకులతో కలిసి దాని పనితీరును తెలుసుకున్నారు. కార్యక్రమంలో పల్లెసృజన వ్యవస్థాపక అధ్యక్షులు బ్రిగేడియర్ గణేశం గారు, ఇతర పల్లెసృజన కుటుంబ సభ్యులు, రైతులు పాల్గొన్నారు. ప్రస్తుతం ఈ యంత్రం ఆవిష్కరణ ద్వారా 'మల్బరీ పంట పండించాలంటే కూలీల ఖర్చుకు భయపడి ఆ పంట వేయటం మానుకుంటున్న రైతులకు ఇదో పెద్ద వరంగా మారింది. ఇప్పుడు పంట వేయటం మానుకున్న రైతులు కూడా మళ్ళీ తమకు ఇష్టమైన మల్బరీ సాగుకు సిద్ధమవుతున్నారు. రైతులపై ఇంతటి ప్రభావాన్ని చూపిన ఈ ఇన్నోవేషన్ రూపకల్పనతో ప్రవీణ్ కుమార్‌కు అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు అందటమే కాక, కేంద్ర సిల్క్ బోర్డ్ వారు ఈ యంత్రం కొనుగోలుపై 50% సబ్సిడీని ప్రకటించేందుకు ప్రవీణ్‌తో ఎంఓయు కుదుర్చుకోవటం జరిగింది.

PALLE SRUJANA Telugu Bi-monthly    Sept-Oct 2025    RNI No. TELTEL/ 2012/74620

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

ఒక్కో సంచిక
రూ. 30/-లు
మాత్రమే





